


నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com

# కరీంనగర్

పెద్దపల్లి, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల

శనివారం 21 మార్చి 2026 15 పేజీలు




# ఎమ్మెల్యే -సీపీ వివాదం తారాస్థాయికి...

# అసెంబ్లీలో చర్చకు దారితీసిన వైనం..!

- జాతర ఘటనతో మొదలై రాజకీయ రగడగా మారిన వివాదం
- సీపీ గౌస్ ఆలం పై ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి సంచలన ఆరోపణలు
- అసెంబ్లీలో ప్రస్తావన... ప్రభుత్వంపై విచారణకు ఒత్తిడి

సూర్య ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో

హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మధ్య నెలకొన్న వివాదం రోజురోజుకు తీవ్రరూపం దాల్చుతూ రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. సాధారణ పరిపాలనా స్థాయి విభేదంగా మొదలైన ఈ వ్యవహారం ఇప్పుడు అసెంబ్లీ వేదికపై చర్చకు రావడంతో మరింత ప్రాధాన్యత సంతరించుకుంది.ఈ వివాదానికి ఆరంభం ఇటీవల జరిగిన సమ్మక్క--సారలమ్మ జాతర సందర్భంగా జరిగిన సంఘటనగా చెబుతున్నారు. ఎమ్మెల్యే స్వగ్రామమైన వీణవంకలో ఏర్పాటు చేసిన జాతర గద్దె వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించిన ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను పోలీసులు అడ్డుకోవడం ఉద్రిక్తతలకు దారితీసింది. ఈ ఘటనను ఎమ్మెల్యే తన గౌరవానికి భంగం కలిగించే చర్యగా అభివర్ణిస్తూ పోలీస్ వ్యవస్థపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.ఆ ఘటన తర్వాత కౌశిక్ రెడ్డి వరుసగా ప్రెస్ మీట్లు నిర్వహిస్తూ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం పై ఘాటు విమర్శలు గుప్పించారు. 8లో



# నెల రోజుల భక్తి... ఏడాదంతా స్ఫూర్తి ..

## - నేడే ఈద్ ఉల్ ఫితర్

సూర్య జమ్మికుంట



షవ్వాల్ నెలవంక తొంగి చూసింది. అత్యంత పవిత్రంగా కఠోర నియమ, నిష్టలతో కొనసాగించిన రంజాన్ నెలకు ముస్లింలు ఘనంగా వీడ్కోలు పలికారు. నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు (రోజా)లు కొనసాగించి ఇక సంతోషంగా ఈద్ ఉల్ ఫితర్ పండుగ సంబురాలు జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. శుక్రవారం సాయంత్రం నెలవంక దర్శనం ఇవ్వడంతో ఉలేమాలు శనివారం ఈద్ ఉల్ ఫితర్ వేడుకలు జరుపుకోవాలని ప్రకటించారు. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు ఆకలి, దప్పికల నుంచి ఓర్పు,సహనం అనే సద్గుణాలను నేర్చుకున్నారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలనే తత్వాన్ని అలవర్చుకున్నారు. 30 రోజుల పాటు చేపట్టిన దీక్షలు, ప్రార్థనలతో పొందిన నైతిక విలువలను వచ్చే ఏడాదంతా స్ఫూర్తిగా కొనసాగించడానికి సంసిద్ధులయ్యారు. ముస్లింలు ఎంతో పవిత్రంగా భావించే రంజాన్ పండుగ శనివారం భక్తిశ్రద్ధలు, ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో పండుగ ప్రాధాన్యం, నెల రోజులుగా చేపట్టిన ఉపవాస దీక్షలు (రోజా)లతో నేర్చుకున్న శిక్షణ ముస్లింలందరు పాటించాలని మతపెద్దలు, ఉలేమాలు చెబుతున్నారు.షవ్వాల్ మాసంలోని మొదటి రోజు కనిపించే నెలవంక తర్వాత ప్రత్యేక దువా చేసి ఈద్ ఉల్ ఫితర్ పండుగ జరుపుకుంటారు. ఈద్ ఉల్ ఫితర్ పండుగ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. ముస్లింలు పండుగ రోజు ఉదయాన్నే తలస్నానం చేసి, (మిగతా 8లో)



## నిర్ణీత గడువులోగా అభివృద్ధి

# పనులను పూర్తి చేయాలి

- 15 రోజులలో సంగీత పాఠశాల అభివృద్ధి పనులను పూర్తి చేయాలి
- పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

సూర్య మంథని

నిర్ణీత గడువులోగా చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంథని పట్టణ పరిధిలో విస్తృతంగా పర్యటించారు. మంథని పట్టణంలోని సంగీత పాఠశాల, మున్సిపల్ కార్యాలయ, జూనియర్ బాయ్స్ స్కూల్, సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. మంథని (మిగతా 8లో)



# అలంకారప్రాయంగా అంగన్ వాడి భవనం

- నిర్మాణం పూర్తయిన నిరుపయోగంగానే?
- ప్రారంభానికి నోచుకోని అంగన్ వాడి భవనం
- పదేండ్ల నుండి అద్దె భవనంలో చిన్నారుల చదువులు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

సూర్య గంభీరావుపేట

3లో



# విద్యకు సరిపోని బడ్జెట్ కేటాయింపులు

## - పెండింగ్ బిల్లులు, పిఆర్సీ ప్రస్తావన లేకపోవడం విచారకరం - స్టేట్ టీచర్స్ యూనియన్

**సూర్య జగిత్యాల ప్రతినిధి**




జనాకర్షక పథకాలకే తప్ప ప్రస్తుత విద్యా వ్యవస్థను బాగు చేసే విధంగా విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపులు లేవని స్టేట్ టీచర్స్ యూనియన్ జగిత్యాల జిల్లా శాఖ అభిప్రాయపడింది. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌పై ఎస్టీయూ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బైరం హరికిరణ్, పాలేపు శివ రామకృష్ణ మాట్లాడుతూ 2026-27 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన రూ. 3,24,234 కోట్ల బడ్జెట్ లో విద్య, మానవ వనరులకు కేటాయించింది 26,674 కోట్లు మాత్రమే.. ఇది మొత్తం బడ్జెట్లో 8.2%. ఉదయం అల్పాహారం, ఇంటర్ వరకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఆహ్వానించదగినదే. గత సంవత్సరం కంటే రూ. 3,566 కోట్లు అదనంగా కేటాయించినప్పటికీ పెంచిన మొత్తం బ్రేక్ ఫాస్ట్, ఇంటర్ వరకు మధ్యాహ్న భోజన పథకం విస్తరణ, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు కోసమే సరిపోకపోవచ్చు. అన్ని పాఠశాలల్లో మౌలిక వసతుల మెరుగుదల గురించి, మధ్యాహ్న భోజనం నాణ్యత పెంపు గురించి అదనపు నిధుల కేటాయింపు ప్రస్తావన లేదు. గత సంవత్సరం 7.58 శాతం కేటాయించగా, ఈ సంవత్సరం 8.22 శాతం కేటాయించారు. విద్యకు 15% కేటాయిస్తామని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్న హామీ వరుసగా 3 వ సారి బడ్జెట్లో కూడా నెరవేరలేదు. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌ను సమీక్షించి కనీసం 15% కేటాయించాలని ఎస్టియు డిమాండ్ చేసింది. ఉద్యోగుల ఆరోగ్య పథకానికి రూ. 1056 కోట్లు కేటాయింపును స్వాగతిస్తూనే మరి పిఆర్సీ సంగతేంటి? అని ప్రశ్నించారు. ఉద్యోగుల ఆరోగ్య పథకానికి అయ్యే ఖర్చు మొత్తం రూ. 1056 కోట్లు రాష్ట్ర ప్రభుత్వమే భరించి ఉద్యోగులకు, పెన్షనర్లకు వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు డిజిటల్ హెల్త్ కార్డులపై నగదు రహిత వైద్యం అందించాలని ప్రభుత్వం నిర్ణయించడాన్ని స్టేట్ టీచర్స్ యూనియన్ స్వాగతిస్తున్నదని అన్నారు. తెలంగాణ రెండో పీఆర్సీ అమలు గురించి గానీ, అదనపు నిధుల కేటాయింపు గురించి గానీ బడ్జెట్ లో ప్రస్తావించకపోవడం ఉద్యోగ, ఉపాధ్యాయులను నిరాశకు గురిచేసిందన్నారు. ఇప్పటికే పి.ఆర్సీ అమలు 33 నెలలు ఆలస్యమైందనీ, అధికారం లోకి వచ్చిన ఆరు నెలల్లో మంచి పి.ఆర్సీ అమలు చేస్తామని మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని 27 నెలలు గడుస్తున్నా నిలబెట్టుకోక పోవడం విచారకరమన్నాడు. పెండింగ్ డిఎలు, పెండింగ్ బిల్లులు, 2024 మార్చి నుండి ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు గురించి ప్రస్తావనే లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పి.ఆర్సీ, పెండింగ్ బిల్లులు, బకాయిల గురించి కూడా స్పష్టత ఇవ్వాలని జగిత్యాల జిల్లా శాఖ డిమాండ్ చేస్తున్నది. రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి మచ్చ శంకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సీర్ణంచ రవీందర్, జిల్లా ఆర్థిక కార్యదర్శి మేకల ప్రవీణ్ ఉన్నారు.

## సాంప్రదాయ కలలను కాపాడడం మనందరి బాధ్యత

**- జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దావ వసంత సురేష్**

**సూర్య జగిత్యాల ప్రతినిధి**




జగిత్యాల పట్టణంలోని పాత బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన శ్రీశివ కేశవ క్లాసికల్ డాన్స్ స్టూడియోను జగిత్యాల జిల్లా పరిషత్ మాజీ చైర్మ న్ దావా వసంత సురేష్ ప్రారంభించారు, ఈ సందర్భంగా దావ వసంత సురేష్ మాట్లాడుతూ, జగిత్యాల పట్టణంలో నాట్య కళాశాల ప్రారంభించడం అభినందినీయమనిఅన్నారు. మన పూర్వీకులు అందించిన సాంప్రదాయ కలలను, సంస్కృతిని,కాపాడడం మన అందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఈకార్యక్రమానికి ఆహ్వానించిన,శ్రీశివ కేశవ క్లాసికల్ డాన్స్ స్టూడియో నిర్వాహకురాలు, బట్టు.దేవి ప్రియను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో టి.యు.డబ్ల్యూ.జే,ఐ జె యు రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగుల గోపాల చారి, సోషల్ డిజిటల్ మీడియా రాష్ట్ర కమిటీ సభ్యుడు, టీ.వీ సూర్యం, శ్రీ వెడ్డింగ్ ఇంటీరియల్ డిజైనర్ పావని తదితరులు పాల్గొన్నారు

## ప్రైవేట్ స్కూల్ ఎదుట గ్రామస్థుల ఆందోళన

**సూర్య జగిత్యాల ప్రతినిధి**



జగిత్యాల విద్యానగర్‌లోని ఓ ప్రైవేటు హై స్కూల్ ముందు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. జగిత్యాల రూరల్ మండలం శంకర్రావుపేట గ్రామస్తులు శుక్రవారం స్కూల్ వద్ద బైఠాయించి ధర్నా చేపట్టారు. 15 రోజుల క్రితం స్కూల్ వ్యాన్ ఢీకొని ప్రణీత్ అనే విద్యార్థికి తీవ్ర గాయాలు అయ్యాయి. అప్పటి నుంచి ఆసుపత్రిలో కోమాలోనే విద్యార్థి ఉండటంతో చికిత్స కోసం ఇప్పటికే రూ.10 లక్షలు ఖర్చయ్యాయని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగినప్పటి నుంచి స్కూల్ యాజమాన్యం స్పందించ లేదని ఆరోపించారు. కనీసం హాస్పిటల్ ఖర్చులు భరించాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తులు ఆందోళన చేపట్టారు.

## ఆస్తి పన్ను చెల్లించని వారి ఆస్తి జప్తుకు చర్యలు

**- మున్సిపల్ కమీషనర్ స్పందన**


**సూర్య జగిత్యాల ప్రతినిధి**




ఆస్తి పన్ను చెల్లించని వారి ఆస్తి జప్తుకు చర్యలు తీసుకుంటామని జగిత్యాల మున్సిపల్ కమీషనర్ స్పందన అన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి ఆస్తి పన్ను ప్రధాన ఆదాయ వనరుగా ఉంటుంది. ఈ నిధుల ద్వారా పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాలు వంటి మౌలిక వసతులు మెరుగుపరచబడుతున్నాయి అన్నారు.ప్రస్తుతం భారీ స్థాయిలో ఆస్తి పన్ను బకాయిలు ఉన్నప్పటికీ, పన్నులు చెల్లించకుండా నిర్లక్ష్యం చూపుతున్న ఆస్తి యజమానులకు రెడ్ నోటీసులు జారీ చేస్తున్నాము అయినప్పటికీ స్పందన లేని సందర్భాలలో, మున్సిపాలిటీ చట్టాల ప్రకారం ఆస్తుల జప్తు చర్యలు చేపట్టబడతాయని హెచ్చరించారు.జప్తు చర్యల అమలుకు ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేసినామని, సంబంధిత ఆస్తి యజమానులు సహకరించగలరని కోరారు.

## ప్రత్యేక వైద్య శిబిరంకు విశేష స్పందన

**సూర్య, రాయికల్**



99 రోజుల ప్రజా పాలనలో భాగంగా మండలం లోని ఒడ్డెలింగాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక వైద్య శిభిరంకు విశేష స్పందన లభించింది.ఈ శిభిరం నకు 248 మందికి ఆరోగ్య పరీక్షలు చేసి, 54 మందిని మెరుగైన వైద్యం కోసం రిఫరీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా ఉప వైద్యధికారి శ్రీనివాస్,ఎన్సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ డా.రాజేందర్ రెడ్డి పర్య వేక్షణలో వైద్య శిబిరం నిర్వహించారు.ఇట్టి వైద్య శిబిరంలో వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డా. సతీష్ కుమార్,వైద్యులు నిఖిత,రాజేశ్వర్,వైష్ణవి, అనూష,లావణ్య, హరికృష్ణ,ఎంపీవో శుష్మ,ప్రజా ప్రతినిధులు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ముస్లింలకు నూతన వస్త్రాలు పంపిణీ చేసిన సర్పంచ్ రహీం

**సూర్య కోరుట్ల రూరల్**



మండలంలోని చిన్నమేట్పల్లి గ్రామంలో రంజాన్ పండుగని పురస్కరించుకుని తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ఈద్ కా తోఫా నూతన వస్త్రాలను గ్రామ సర్పంచ్ మహమ్మద్ రహీం, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు కోరుట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సీనియర్ నాయకులు కలిసి ముస్లిం సోదరులకు అందజేశారు.కార్యక్రమంలో మైనార్టీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్ అంచనా వాస్తవికతకు దూరం

**- మాజీ జెడ్పి చైర్ పర్సన్ దావ వసంత సురేష్**

**5సూర్య జగిత్యాల ప్రతినిధి**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 2026-27 సంవత్సరం వార్షిక బడ్జెట్ వాస్తవికతకు దూరం ఉందని జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ ఆరోపించారు. రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు కాలేదని, రైతు భరోసా కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణంపై, అభివృద్ధిపై ప్రభుత్వ చిత్త శుద్ధి కొరవడినట్లు స్పష్టమైందని, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనలో ప్రభుత్వం వైఫల్యం ఈ బడ్జెట్‌తో బయట పడిందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో గ్రామీణ అభివృద్ధికై కేటాయించిన నిధుల కొరత బడ్జెట్ డొల్లతనం, ప్రభుత్వ పనితీరును తేటతెల్లం చేస్తున్నాయని, విద్యా, వైద్యం, ఉద్యోగ, ఉపాధి, గ్రామీణ, రైతు ఇలా అన్ని వర్గాలను మభ్య పెట్టేలా అంకెల గారడీతో బడ్జెట్ ప్రవేశ పెట్టారని వసంత ఆరోపించారు. అసలు ప్రస్తుత రాష్ట్ర ఆర్థిక పరిస్థితికీ, ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌కు పొంతన లేకుండా పోయిందని విమర్శించారు.

## జగ్గాసాగర్ గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి

**సూర్య మెట్‌పల్లి రూరల్**



మండలంలోని జగ్గా సాగర్ గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలాని ఆర్డీవో కార్యాలయంలో అధికారికి వినతి పత్రం అందజేశారు. అనంతరం సర్పంచులు మాట్లాడుతూ జగ్గసాగర్, కో శీ ద్రి కర్ల, ఆత్మకూర్,ఆత్మ నగర్,పెద్దాపూర్,కొనరావుపేట, రామా లచ్చక్క పేట, రామరావు పల్లె,మెట్ల చిట్టాపూర్,రంగారావుపేట,విట్టంపేట, బండ లింగాపూర్, వెల్లుల్ల పలు గ్రామాలలో పండించిన మొక్కజొన్న పంటను మెట్టుపల్లి వ్యవసాయ మార్కెట్ కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లడానికి రైతులు ఇబ్బందికి గురవుతున్నారని తెలిపారు.జగ్గాసాగర్ గ్రామంలో గల కొండ స్వామి ఆవరణలో గల భూమిలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే విక్రయించడానికి రైతుల అందరికీ సులువుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు పి జగన్ గౌడ్, జి.రాజేశ్వర్, మారు గంగా రెడ్డి, సుంకేటా అరుణ, మంజుల, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అలంకారప్రాయంగా అంగన్ వాడి భవనం

**- నిర్మాణం పూర్తయిన నిరుపయోగంగానే?- ప్రారంభానికి నోచుకోని అంగన్ వాడి భవనం**

**- పదేండ్ల నుండి అద్దె భవనంలో చిన్నారుల చదువులు - పట్టించుకోని సంబంధిత అధికారులు**

**సూర్య, గంభీరావుపేట**

చిన్నారుల చదువులకోసం అంగన్ వాడి భవనాన్ని లక్షలు వెచ్చించి నిర్మించారు. కానీ ఏళ్లు గడుస్తున్న అంగన్ వాడి భవనం మాత్రం ప్రారంభానికి నోచుకోవడం లేదు. దీంతో చిన్నారుల చదువులు అద్దే భవనంలో కొనసాగుతున్నాయి. గంభీరావుపేట మండలం నర్మాల మానేరు క్యాంపులో గల అంగన్ వాడి భవన నిర్మాణం పూర్తయిన అలంకారప్రాయంగా దర్శనమిస్తోంది. దాదాపు రూ. 10 లక్షల రూపాయలు వెచ్చించి నిర్మాణం చేస్తే అధికారుల పర్యవేక్షణ లోపంతో ప్రారంభానికి మాత్రం నోచుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని భవనం ప్రారంభిస్తే బాగుంటుందని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



**- పదేళ్లుగా అద్దె భవనం లోనే...**

నర్మాల మానేరు క్యాంపులో గల అంగన్ వాడి కేంద్రం దాదాపుగా 10ఏళ్ల నుండి అద్దె భవనంలో కొనసాగడం గమనార్హం. అద్దె భవనంలో ఇరుకైన గదులు, ఆటస్థలం లేకపోవడంతో పిల్లలు ఇబ్బందులకు గురవు తున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**- భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలి...**

**- తొట్ల మల్లేష్ యాదవ్,**
**బిజెపి మండల ప్రధాన కార్యదర్శి**



చిన్నారుల చదువుల కోసం లక్షలు వెచ్చించి నిర్మించిన అంగన్ వాడి భవనం నిరుపయోగంగా ఉంచడం సరైనది కాదు. ప్రభుత్వం వెంటనే స్పందించి భవనం ప్రారంభించి వినియోగంలోకి తీసుకురావాలి.

# బస్సుల కోసం గంటల నిరీక్షణ...

**- ముస్తాబాద్ బస్టాండ్‌లో ప్రయాణికుల అవస్థలు... - సమయపాలన పట్టిక లేక గందరగోళం...**
**- ఎప్పుడు వస్తుందో తెలియని బస్సులు... - విద్యార్థులు, ఉద్యోగులకు తీవ్ర ఇబ్బందులు...**
**- సౌకర్యాల లేమితో ప్రయాణికుల ఆగ్రహం...**

**సూర్య, ముస్తాబాద్**

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్‌లో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సుల రాకపోకలకు సంబంధించి ఎలాంటి సమయపాలన పట్టిక (టైమ్ టేబుల్) లేకపోవడంతో ప్రజలు ఎప్పుడు బస్సు వస్తుందో తెలియక గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోంది.పట్టణానికి, గ్రామాలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులు ఎక్కువగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రత్యేకించి ఉదయం, సాయంత్రం సమయాల్లో బస్సులు ఆలస్యంగా రావడం వల్ల ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.బస్టాండ్‌లో సరైన సమాచారం అందించే సిబ్బంది లేకపోవడం, డిజిటల్ డిస్ప్లే బోర్డులు లేకపోవడం కూడా సమస్యను మరింత పెంచుతోంది. దీంతో ప్రయాణికులు ఎవరిని అడగాలో తెలియక అయోమయంలో పడుతున్నారు. ప్రస్తుతం పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని వెంటనే టైమ్ టేబుల్ ఏర్పాటు చేయాలని, బస్సుల సంఖ్య పెంచాలని, సరైన సమాచారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు సంబంధిత అధికారులను కోరుతున్నారు.



# విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట

**- సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు - ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రవేశం**
**- డిప్లమా, ఐటీఐ విద్యార్థులకు రూ.2000 స్కాలర్షిప్ - విద్యా రంగానికి రూ.26,674 కోట్ల భారీ కేటాయింపు**
**- ఉస్మానియా యూనివర్సిటీ, యువ వికాసానికి ప్రత్యేక**

**సూర్య, ముస్తాబాద్**

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి ప్రాధాన్యతనిస్తూ కీలక నిర్ణయాలు తీసుకున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎన్ఎస్‌యూఐ నియోజవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ మీడిదొడ్డి భాను కృతజ్ఞతలు తెలిపారు.ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం ప్రవేశపెట్టడం, డిప్లమా మరియు ఐటీఐ విద్యార్థులకు ప్రతినెల రూ.2000 స్కాలర్షిప్ ప్రకటించడం వంటి నిర్ణయాలు విద్యార్థుల భవిష్యత్తుకు ఎంతో దోహదపడతాయని అన్నారు. అదేవిధంగా, రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి రూ.26,674 కోట్లు కేటాయించడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రముఖ విద్యాసంస్థ అయిన ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధికి రూ.1000 కోట్లు కేటాయించడం విద్యా మౌలిక వసతుల మెరుగుదలకు దోహదం చేస్తుందని తెలిపారు. ఇంకా, యువత అభివృద్ధి కోసం 'రాజీవ్ యువ వికాసం' పథకానికి రూ.6000 కోట్లు కేటాయించడం యువతకు ఉపాధి అవకాశాలను పెంచే దిశగా కీలక అడుగని భాను అభిప్రాయపడ్డారు.విద్యార్థులు, యువత సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ప్రశంసనీయం అని, ఇలాంటి ప్రజా హిత నిర్ణయాలు కొనసాగించాలని ఆయన కోరారు.



## జూనియర్ విద్యార్థుల భోజన పథకం పట్ల టీజీజెఎల్ఏ హర్షం

**సూర్య, సిరిసిల్ల టౌన్**

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్థిక శాఖ మాత్యులు బట్టి విక్రమార్క అసెంబ్లీ బడ్జెట్ సమావేశంలో ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు డాక్టర్ వస్కుల శ్రీనివాస్,డాక్టర్ కొప్పిశెట్టి సురేష్ తెలియజేశారు.సిరిసిల్లలో ఏర్పాటు చేసిన సమావేశంలో టీజీజెఎల్ఏ జిల్లా అధ్యక్షులు సామల వివేకానంద్,కార్యదర్శి దేవయ్యలు మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్నం భోజన పథకం విస్తరింప చేయాలని గత సంవత్సరమే తమ సంఘం నుంచి స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రిని, విద్యాశాఖ మంత్రి ఏ.రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వాటి ప్రయోజనాల గురించి వివరించడం జరిగిందని తెలిపారు.తెలంగాణ తొలి విద్య కమిషన్ చైర్మన్ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని తెలిపారు.ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే సుమారు రెండు లక్షల మంది విద్యార్థిని విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందని, వారి శారీరక,మానసిక వికాసానికి ఈ పథకం తోడ్పడుతుందని తెలియజేశారు. ఇట్టి సమావేశంలో టీజీజెఎల్ఏ అధ్యాపక బృందం పాల్గొన్నారు.



## శ్రద్ధగా చదివి ఉన్నత స్థానాల్లో స్థిరపడాలి

**- కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**- విద్యార్థులు నిత్యం శ్రద్ధగా చదివి ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని కలెక్టర్ అన్నారు**



తంగళ్ళపల్లి మండలం మండేపల్లిలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల లో కలెక్టర్ శుక్ర వారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయుల, సిబ్బం ది హాజరు రిజిస్టర్, కిచెన్, స్టోర్ రూం పరిశీలించారు. స్టోర్ రూమ్‌లో సరుకుల నాణ్యత తనిఖీ చేశారు. మెనూ చార్ట్ పరిశీలించి. ఆహార పదార్థా లను పరిశీలించారు. హాస్టల్ ఆవరణలో పలు అభివృద్ధి పనుల పురోగతిపై ఆరా తీశారు.అనంతరం ఆమె మాట్లాడుతూ...విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు.పదో తరగతి విద్యార్థులను పరీక్షల మధ్య విరామ సమయం సద్వినియోగం చేసుకోవాలన్నారు. శ్రద్ధగా అన్ని పాఠ్యాంశాలు మరోసారి చదవాలని,సమాధానాలు రాయాలని సూచించారు. మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టలలో పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు.

## పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం...

**సూర్య, ముస్తాబాద్**



రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో పద్మశాలి సంఘం నూతన కార్యవర్గ ఎంపిక ఏకగ్రీవంగా జరిగింది. గౌరవ అధ్యక్షులుగా గౌడ మల్లేశం, అధ్యక్షులుగా తడుక బాల కిషన్, కోశాధికారిగా గౌడ కృష్ణారి, ప్రధాన కార్యదర్శిగా శ్రీరాం మనోహర్, ఉపాధ్యక్షులుగా ఎనగందుల దశరథం, గౌడ మల్లేశం, సలహాదారులుగా బిట్ల వజ్రానందం, తడుక లక్ష్మీనారాయణ,దండె రామ కృష్ణయ్య,కార్యదర్శులుగా బిట్ల దేవానందం, గూడూరు భారత్, బండారి శ్రీకాంత్, ఎంపికవగా, వారిని సభ్యులు సన్మానించి, అభినందించారు.

## వార్డు సభ్యులకు గౌరవ వేతనం ఇవ్వాలి

**- తెలంగాణ రాష్ట్ర వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అతికం**

**సూర్య, బోయినపల్లి**



రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచా యతీ వార్డు సభ్యులకు గౌరవ వేతనం ఇవ్వాలని తెలంగాణ వార్డు సభ్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అతికం రాజశేఖర్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో వార్డు సభ్యులు వార్డు గ్రామ అభివృద్ధి లక్ష్యంగా నిరంతరం పనిచేస్తున్నారని వారి సంక్షే మానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని గౌరవ వేతనం ఇవ్వాలని పేర్కొన్నారు. వార్డు సభ్యులకు తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేకమైన ఇన్సూరెన్స్‌లు కల్పించాలని, ప్రమాద బీమా పథకం ప్రవేశపెట్టాలని తెలిపారు. వార్డు సభ్యుల అభివృద్ధికి ప్రత్యేక నిర్ణయాలు ప్రభుత్వం తీసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆయన వెంట వార్డు సభ్యుల సంఘం రాష్ట్ర నాయకులు బత్తిని అనిల్, మునీందర్ తదితరులు పాల్గొన్నారు.

## రూ.3.24 లక్షల కోట్లతో 2026-27 రాష్ట్ర బడ్జెట్

- రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- రైతు సంక్షేమం, మహిళా సాధికారత, యువతకు ప్రాధాన్యం
- శాఖల వారీగా భారీ కేటాయింపులు... కొత్త పథకాల ప్రకటన

**సూర్య ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో**



తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్ర మార్క 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. మొత్తం రూ.3,24,234 కోట్లతో బడ్జెట్‌ను ప్రతిపాదిస్తూ ప్రజా సంక్షేమమే ప్రధాన ధ్యేయమని తెలిపారు. బడ్జెట్‌లో రూ.2,34,406 కోట్లు రెవెన్యూ వ్యయం, రూ.47,267 కోట్లు మూలధన వ్యయంగా కేటాయించారు. రైతు సంక్షేమానికి రూ.23,179 కోట్లు, విద్యాశాఖకు రూ.26,674 కోట్లు, వైద్యానికి రూ.13,679 కోట్లు, విద్యుత్ శాఖకు రూ.21,285 కోట్లు కేటాయించారు. ఎస్సీ సంక్షేమానికి రూ.11,784 కోట్లు, ఎస్టీకి రూ.7,937 కోట్లు, బీసీలకు రూ. 12,511 కోట్లు, మైనారిటీలకు రూ.3,769 కోట్లు కేటాయించారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధికి రూ.33,688 కోట్లు, సాగునీటి ప్రాజెక్టులకు రూ.22,615 కోట్లు ప్రతిపాదించారు. కొత్త పథకాలుగా జూన్ 2 నుంచి ఇందిరమ్మ కుటుంబ భీమా అమలు చేయనున్నట్లు ప్రకటించారు. విద్యార్థులకు నెలకు రూ.2,000 స్కాలర్‌షిప్ అందించనున్నట్లు తెలిపారు. యువత కోసం రాజీవ్ యువ వికాసం కింద రూ.6,000 కోట్లు కేటాయించారు.రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమన్వయం చేస్తూ ఈ బడ్జెట్ రూపొందించినట్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ బడ్జెట్‌పై ఉమ్మడి జిల్లాకు చెందిన నేతలు పలు విధాలుగా స్పందిస్తున్నారు.

## అందరికీ ఆమోదయోగ్యమైన బడ్జెట్

**సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**

**సూర్య కరీంనగర్**



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ అందరికీ ఆమోదయోగ్యంగా ఉందని అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. సంక్షేమ పథకాలకు,ఆరు గ్యారంటీలకు అధిక నిధులు కేటాయించడం ఇందిరమ్మ ఇండ్లకు పెద్దపీట వేయడం హర్షదాయకం అని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.ప్రజా రవాణాకు ఎస్సీ ఎస్టీల సంక్షేమానికి విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం 2 లక్షల మందికి పెన్షన్లు ఇవ్వడం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారని నరేందర్ రెడ్డి అన్నారు.మొత్తంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలు మరింత అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లే విధంగా ఈ బడ్జెట్ రూపకల్పన చేశారని ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క కు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజలు అభినందనలు తెలిపే సమయమిది అని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.

## బడ్జెట్లో హామీలు, 6గ్యారెంటీలకు కేటాయింపులు లేవు

**బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి**

**సూర్య కరీంనగర్**



ఈసారి బడ్జెట్‌లో నైనా 6 గ్యారంటీలు అమలు చేస్తారని ప్రజలు ఎంతో ఆశగా చూశారని , మళ్లీ వాళ్ళ ఆశలపై కాంగ్రెస్ నీళ్లు చల్లిందని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి విమర్శించారు. బడ్జెట్లో కాంగ్రెస్ హామీలకు, ఆరు గ్యారంటీలకు కేటాయింపులే లేవన్నారు. మహిళలకు రూ.2500 ఊసే లేదన్నారు. చేయూత కింద ఇస్తామన్న రూ.4000 ల పింఛన్ను అతి గతి లేదన్నారు. తులం బంగారంకు, నిరుద్యోగ భృతి కి కేటాయింపులు లేవన్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే అనేకం ఉన్నాయని, బడ్జెట్ కాంగ్రెస్ హామీలకు అనుగుణంగా లేదని, బడ్జెట్ అంకెలు కేటాయింపులు, మాటలు ఘనంగా కనిపించే గారడి మాత్రమేనన్నారు.

## ప్రాధాన్యతా రంగాలకు పెద్దపీట...

**ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ**

**సూర్య కరీంనగర్**



రాష్ట్ర బడ్జెట్‌లో ప్రాధాన్యతా రంగాలకు పెద్దపీట వేశారని మానకొండూర్ ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. వ్యవసాయానికి రూ.23,179 కోట్లు, విద్యాశాఖకు రూ.26,674 కోట్లు, విద్యుత్ శాఖకు రూ.21,285 కోట్లు కేటాయించడం ప్రభుత్వ దూరదృష్టిని సూచిస్తుందని పేర్కొన్నారు.అలాగే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల సంక్షేమానికి గణనీయ నిధులు కేటాయించడం ద్వారా అన్ని వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఆరు గ్యారంటీ పథకాల అమలుకు రూ.50,713 కోట్లు కేటాయించడం ప్రజల్లో ఉన్న అనుమానాలను తొలగించిందన్నారు. మొత్తంగా ఈ బడ్జెట్ సబ్బండ వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని రూపొందించిన మంచి బడ్జెట్ అని పేర్కొంటూ ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కను ఆయన అభినందించారు.

## ప్రజల బడ్జెట్... సంక్షేమానికి పెద్దపీట

**కరీంనగర్ అసెంబ్లీ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు**

**సూర్య కరీంనగర్**



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజల బడ్జెట్ అని కాంగ్రెస్ కరీంనగర్ అసెంబ్లీ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. ఆరోగ్యం, విద్య, సంక్షేమ రంగాలకు పెద్దపీట వేయడం శుభసూచకమన్నారు.వ్యవసాయానికి రూ.23,179 కోట్లు, విద్యకు దాదాపు రూ.26 వేల కోట్లు, సాగునీటికి రూ.22,615 కోట్లు కేటాయించడం అభినందనీయమన్నారు. ఆరు గ్యారంటీల అమలుకు నిధులు కేటాయించడం ప్రభుత్వ కట్టుబాటును సూచిస్తుందని తెలిపారు. ఇందిరమ్మ కుటుంబ భీమా, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం వంటి కార్యక్రమాలు ప్రజల సంక్షేమానికి దోహదపడతాయని పేర్కొన్నారు. మొత్తం మీద ఈ బడ్జెట్ రాష్ట్ర అభివృద్ధికి దోహదం చేస్తుందని అన్నారు.

## ప్రజా రంజక బడ్జెట్ 2026-2027

**కరీంనగర్ కార్పొరేషన్ అర్బన్ డిసిసి అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్**

**సూర్య కరీంనగర్**



తెలంగాణ శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా పాలన ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క శాసనమండలిలో ఉత్తంకుమార్ రెడ్డిలు ప్రవేశపెట్టిన 2026-2027 బడ్జెట్ ప్రజారాజకంగా ఉన్నదని కరీంనగర్ కార్పొరేషన్ అర్బన్ డిసిసి అధ్యక్షులు వైద్యుల అంజన్ కుమార్అన్నారు. విద్య,వైద్యం, వ్యవసాయ రంగం, పంచాయతీరాజ్, యువతకు ఉపాధి కల్పించే రాజీవ్ యువ వికాసం కు పెద్ద ఎత్తున కేటాయింపులు జరిపినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదములు. చరిత్రలో ఎన్నడు BC,SC,ST మైనార్టీలకు ఇంత పెద్ద ఎత్తున ఎవరూ ఇలాంటి కేటాయింపులు జరుప లేదని ఇది కాంగ్రెస్ సారధ్యం లోని రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి మాత్రమే ఖ్యాతి దక్కుతుందని కొనియా డారు. దళిత బహుజనుల , మైనార్టీల అభివృద్ధికి తోడ్పాటును అందించే ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని ఆయన ప్రశంసించారు.

## బీసీలకు నిధుల కేటాయింపులో వివక్ష

**- తెలంగాణ జాగృతి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్**

**సూర్య కరీంనగర్**



రాష్ట్ర బడ్జెట్‌పై తెలంగాణ జాగృతి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ తీవ్ర విమర్శలు చేశారు. బీసీల సంక్షేమానికి తగిన నిధులు కేటాయించకుండా వివక్ష చూపారని ఆరోపించారు. మహిళలకు ఇచ్చిన హామీలు అమలు కాలేదని, మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2500 ఇవ్వకుండా మోసం చేశారని అన్నారు. అలాగే కళ్యాణలక్ష్మి పథకంలో తులం బంగారం హామీ కూడా నెరవేర్చలేదని విమర్శించారు. పెన్షన్లు, ఉద్యోగాల విషయంలో కూడా ప్రభుత్వం విఫలమైందని, యువతకు ఇచ్చిన హామీలు బడ్జెట్‌లో కనిపించలేదన్నారు. విద్య, వైద్య రంగాలకు తగిన ప్రాధాన్యం ఇవ్వలేదని ఆక్షేపించారు. మొత్తంగా ఈ బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలను నిరాశపరిచిందని హరిప్రసాద్ వ్యాఖ్యానించారు.

## ఆడంభరంగా అంకెల్లో బడ్జెట్

**సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్.**

**సూర్య కరీంనగర్**



2023 డిసెంబర్ లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన పేరుతో ప్రభుత్వాన్ని నడిపిస్తూ రాష్ట్ర అభివృద్ధి ప్రజా సంక్షేమం కోసం ప్రతి ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టే బడ్జెట్ చూస్తుంటే ఆడంబరంగా అంకెల్లో భారీ బడ్జెట్లను ప్రవేశపెడుతూ అమలు చేయడానికి మాత్రం ప్రభుత్వం దగ్గర డబ్బులు లేకుండా పోతున్నాయని సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.2026 - 2027 సంవత్సరానికి గాను రాష్ట్ర ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ లో 5 లక్షల ప్రమాద భీమా, విద్యార్థు లకు మధ్యాహ్న భోజనం,ఉద్యోగులకు ప్రమాద బీమా మంచిదైనప్పటికీ పేదలకు ఇండ్లు,పెన్షన్లు ఇవ్వకపోవడం దారుణమని, ఇందిరమ్మ ఇండ్లకు గతంలో కేటాయించిన 14వేల కోట్ల ను పెంచాల్సింది పోయి కేవలం 7వేల కోట్లు కేటాయించడం సరైంది కాదని, విద్యకు 20శాతం నిధులు కేటాయించాలని విద్యావేత్తలు చెబుతున్నప్పటికీ అమలు చేయ్యపోగా గత బడ్జెట్ కంటే స్వల్పంగా అంటే 0.65 శాతం పెంచడం పట్ల విద్యా రంగంపై ప్రభుత్వానికి చిన్న చూపు ఉన్నట్లు కనబడుతుంది. హైదారాబాద్ చుట్టుతనే విద్యకు ప్రాధాన్యత ఇవ్వడం వివక్షత అవుతుం దని,వైద్య రంగానికి 4.2 శాతం నిధులు కేటాయించడం సరైంది కాదని కనీసం 10 శాతం కేటాయించేది ఉండేనని అన్నారు.కరీంనగర్ జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం ప్రత్యేకించి బడ్జెట్లో ప్రస్తావన లేకపోవడం దారుణమని, ఉత్తర తెలంగాణకే తల మాణికం లాంటి కరీంనగర్లో మానేరు రివర్ ఫ్రంట్ కేబుల్ బ్రిడ్జి పనుల పురోగతికి నిధులు కేటాయించలేదని, జిల్లాలోని ప్రాజెక్టులు, వాటి పరిధిలోని కాలువల నిర్మాణాలకు నిధులు కేటాయించకపోవడం సరైన మొత్తంగా బడ్జెట్ చూస్తే బారెడు అమలు మాత్రం మూరెడులా ఉందని పంజాల శ్రీనివాస్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

## కాంగ్రెస్ ప్రభుత్వానిది అంకెల గారడి బడ్జెట్

**మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్**

**సూర్య గంగాధర**



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ అంకెల గారడీ బడ్జెట్ అని ప్రజలకు ఇచ్చిన హామీలకు ఉపయోగం లేదని చొప్పదండి మాజీ శాసనసభ్యుడు సుంకె రవిశంకర్ అన్నారు. అసెంబ్లీ లో శుక్రవారం రాష్ట్ర ఆర్థిక మంత్రి బట్టి విక్రమార్క ప్రవేశ పెట్టిన బడ్జెట్‌పై సమీక్షించి మీడియతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఏ ఒక్క వర్గానికి న్యాయం జరిగే విధంగా లేదన్నారు. అన్ని వర్గాలకు అనేక హామీలు ఇచ్చి రెండున్నర సంవత్సరాలలో అనేక అప్పులు చేసిందని అన్నారు. ఆరు గ్యారంటీల హామీతో అధికారంలోకి వచ్చి సంక్షేమ పథకాలను నెరవేర్చడంలో విఫలం అయ్యారని అన్నారు. రైతులకు రైతుబంధు, మహిళలకు 2వేల 5వందలు వంటి పథకాలపై మాట్లాడడం లేదన్నారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రజలకు ఆమోదయోగ్యం కాదన్నారు.

## రాష్ట్ర బడ్జెట్ మోసపూరితం

**బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్**

**సూర్య కరీంనగర్**



తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌పై బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ తీవ్ర విమర్శలు చేశారు. ఈ బడ్జెట్ పూర్తిగా మోసపూరితమైందని, ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు నిధుల కేటాయింపులో వివక్ష చూపించారని ఆరోపించారు.అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ప్రకారం ప్రతి సంవత్సరం రూ.20 వేల కోట్లు కేటాయిస్తామని చెప్పి, ప్రస్తుతం కేవలం రూ.12 వేల కోట్లు మాత్రమే కేటాయించడం వంచనగా పేర్కొన్నారు. అలాగే వృద్ధులకు రూ.4 వేల పెన్షన్ హామీ నెరవేర్చలేదని విమర్శించారు.మహిళలకు నెలకు రూ.2500 ఇవ్వాలన్న హామీ అమలు కాలేదని, విద్య, వైద్య రంగాలకు సరైన నిధులు కేటాయించలేదని ఆక్షేపించారు. ఉద్యోగాల విషయంలో కూడా ప్రభుత్వం విఫలమైందని, నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. మొత్తంగా ఈ బడ్జెట్ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను నిరాశపరిచిందని చల్ల హరిశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

## నిరంతరం విధుల్లో ఉండే పోలీస్ సిబ్బందికి

# శారీరక విశ్రాంతి ఎంతో అవసరం

**- పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం**

**- కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో విశ్రాంతి గదిని ప్రారంభించిన సీపీ**

**సూర్య కరీంనగర్**

పోలీస్ సిబ్బంది సంక్షేమం, పనితీరును మెరుగు పరిచే లక్ష్యంతో, కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం శుక్రవారం కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో నూతనంగా నిర్మించిన విశ్రాంతి గదిని ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నిరంతరం విధుల్లో ఉండే పోలీస్ సిబ్బందికి మానసిక ప్రశాంతత, శారీరక విశ్రాంతి ఎంతో అవసరమని పేర్కొన్నారు. సిబ్బంది ఆరోగ్యం, సౌకర్యాల విషయంలో రాజీ పడబోమని, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా వారి పనితీరు మరింత మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అన్ని పోలీస్ స్టేషన్లలో మౌలిక సదుపాయాలను ఆధునీకరించి, సిబ్బందికి మెరుగైన పని వాతావరణాన్ని కల్పించడానికి విభాగం కట్టుబడి ఉందని సీపీ తెలిపారు. తగిన విశ్రాంతి పొందిన అధికారులు అత్యవసర సమయాల్లో, ప్రజలకు సేవ చేయడంలో మరింత చురుగ్గా, సమర్థవంతంగా పనిచేస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ సోహం సునీల్, రూరల్ ఏసీపీ విజయకుమార్, ట్రాఫిక్ ఏసీపీ వెంకటస్వామి, రూరల్ ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డితో పాటు ఎస్సైలు నరేష్, లక్ష్మా రెడ్డిలతో పాటు ఇతర పోలీసు అధికారులు, పోలీసు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.





## కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ చైర్మన్‌గా "అల్ఫోర్స్" నరేందర్ రెడ్డి

**- నూతన కార్యవర్గం ఏర్పాటు**

**సూర్య కరీంనగర్**

సైక్లింగ్ క్రీడకు ప్రత్యేకత ఉన్నదని, ఈ క్రీడకు విస్తృత ప్రచారం చాలా అవసరమని చైర్మన్ కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక కరీంనగర్ లోని వావిలాల పల్లి లో నిర్వహించిన నూతన కార్యవర్గ ఎన్నికల ప్రక్రియలో పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వ్యాప్తంగా కరీంనగర్ జిల్లా సైకిల్ అసోసియేషన్‌కి ప్రత్యేకత ఉన్నదని, ఎన్నో టోర్నమెంట్ల ను నిర్వహించి క్రీడ స్ఫూర్తిని పెంపొందించిందని వారు చెప్పారు. ఈ సందర్భంగా అధ్యక్షునిగా ఎన్నికైన మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ సైక్లింగ్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో అనేక చైతన్యవంతమైన కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని ప్రధానంగా నిర్వహించి క్రీడా స్ఫూర్తిని పరిరక్షించామని వారు చెప్పారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గం మాట్లాడుతూ 2022 నుండి 26 వరకు కరీంనగర్ జిల్లా సంఘం వారి ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలను ముఖ్యంగా అవగాహన కల్పించే కార్యక్రమాలకు దీటుగా వివిధ స్థాయిలలో పాల్గొనే విధంగా అనేక కార్యక్రమాలను చాలా ఆదర్శంగా చేపడుతామని, నేటికీ అదే స్ఫూర్తితో పలు కార్యక్రమాలను వివిధ ప్రాంతాలను ఘనంగా నిర్వహిస్తామని వారు చెప్పారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వ హించినటువంటి ఎన్నికలలో నూతన కార్యవర్గం అంతయు ఏకగ్రీవంగా ఎన్నికవ్వడం చాలా హర్షించదగ్గ విషయమని చెప్పారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించిన ఎన్నికలకు పరిశీలకు లుగా రాష్ట్రం నుండి ఏ.కిషన్, జిల్లా యువజన క్రీడ విభాగం నుండి పవన్, ఒలంపిక్ అసోసి యేషన్ పత్రినిధి జనార్ధన్ రెడ్డి, రిటర్నింగ్ ఆఫీ సర్‌గా, మాజీ కార్పొరేటర్ ఒలింపిక్ అసోసియే షన్ ప్రతినిధి టి.రమేష్ రెడ్డి వ్యవహరించారని తెలిపారు.



నూతన అధ్యక్షునిగా డాక్టర్ కెప్టెన్ బి మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సురభి వేణుగోపాల్, కోశాధికారిగా విజగదీశ్వర చారి, ఉపాధ్యక్షులుగా ఎం అరవింద్, ఎస్ రాజయ్య, ఎస్ అనుదీప్, సంయుక్త కార్యదర్శిగా ఎస్.ఇంద్రవేశ్ వీ రమేష్ జై నరేష్ తదితరులు సభ్యులుగా ఎన్నుకోబడ్డారని వారు చెప్పారు. ఈ సంఘానికి డాక్టర్ బంగారు స్వామి, ఎస్.కోదండరాములు ఫ్యాట్రన్స్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతన కార్యవర్గాన్ని ఘనంగా సత్కరించారు. క్రీడా స్ఫూర్తిని పెంపొందిస్తామని, క్రీడల పట్ల చక్కటి వైఖరిని ప్రదర్శిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## భారత సైన్యంలో నియామకానికి ఆన్‌లైన్ నమోదు దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం

**సూర్య కరీంనగర్**

భారత సైన్యంలో వివిధ కేటగిరీల్లో నియామకానికి సంబంధించి అభ్యర్థులు తమ దరఖాస్తులను సమర్పించడానికి ఆన్‌లైన్ నమోదు, దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. అగ్నివీర్ కేటగిరీల్లో అవివాహిత యువత కోసం నియామక నోటిఫికేషన్ 13 ఫిబ్రవరి 2026న www.joinindianarmy.nic.in వెబ్‌సైట్‌లో విడుదలైంది. సికింద్రాబాద్ ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీస్ పరిధిలోని తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల నివాసితుల నుండి దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయి. నియామకం కోసం అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ క్లర్క్/స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్స్‌మన్ (10వ తరగతి), అగ్నివీర్ ట్రేడ్స్‌మన్ (8వ తరగతి). అభ్యర్థులు తమ అర్హతల ఆధారంగా ఏ రెండు కేటగిరీలకు దరఖాస్తు చేసుకోవచ్చు. అగ్నివీర్ కేటగిరీలకు గరిష్ట వయోపరిమితి 21 సంవత్సరాల నుండి 22 సంవత్సరాలకు పెంచబడింది. ఆన్‌లైన్ కామన్ ఎంట్రన్స్ పరీక్ష (CEE) 13 భాషల్లో (తెలుగు సహా) నిర్వహించబడుతుంది. ITI, డిప్లొమా, ఎన్‌సీసీ అర్హతలు కలిగిన అభ్యర్థులకు అదనపు మార్కులు ఉంటాయి. దరఖాస్తులు కేవలం www.joinindianarmy.nic.in వెబ్‌సైట్ ద్వారా మాత్రమే సమర్పించాలి. దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ 01 ఏప్రిల్ 2026. ఆన్‌లైన్ కామన్ ఎంట్రన్స్ పరీక్ష (CEE) తాత్కాలికంగా 01 జూన్ 2026 నుండి 15 జూన్ 2026 వరకు నిర్వహించబడుతుంది. అడ్మిట్ కార్డులు అదే వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అభ్యర్థులు తాజా సమాచారం కోసం www.joinindianarmy.nic.in వెబ్‌సైట్‌ను తరచూ పరిశీలించాలి, తమ నమోదు చేసిన ఈ-మెయిల్ ఐడీలను చెక్ చేయాలి. మరిన్ని వివరాల కోసం సికింద్రాబాద్ ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీస్‌ను 040-27740059 నంబర్ ద్వారా సంప్రదించవచ్చు. నియామక ప్రక్రియ పూర్తిగా ఆటోమేటెడ్, నిష్పక్షపాత, పారదర్శకంగా జరుగుతుంది. ఎవరైనా మధ్యవర్తులు లేదా మోసగాళ్లు ఉద్యోగం కల్పిస్తామని చెప్పినా నమ్మవద్దు. కేవలం కష్టపడి సిద్ధమవడం ద్వారా మాత్రమే మెరిట్ ఆధారంగా ఎంపిక జరుగుతుంది. మధ్యవర్తులు లేదా ఏజెంట్లకు ఇందులో ఎలాంటి పాత్ర లేదు అని అధికారులు తెలిపారు.

## ఘనంగా ఈటల జన్మదిన వేడుకలు

**సూర్య, వీణవంక**

మాజీ మంత్రి, మల్కాజ్ గిరి ఎంపి ఈటల రాజేందర్ జన్మదిన వేడుకలను శుక్రవారం వీణవంకలో గాలేటి సురేందర్ రెడ్డి, పూదరి అనిల్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి స్వీట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ ఈటల రాజేందర్ హుజురాబాద్ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి పథంలో నడిపించాడని, రాబోయే రోజుల్లో మళ్లీ హుజురాబాద్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పోటీ చేయాలని, ఆయనకు వీణవంక మండల ఈటల అభిమానులు అండదండగా ఉంటామని వారన్నారు. ఆయన మరిన్ని జన్మదిన వేడుకలు జరుపుకోవాలని, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మారముల కొమురయ్య, ఎనుగంటి శ్రీనివాస్ యాదవ్, పెద్ది మల్లారెడ్డి, బొబ్బల విజయ్ కుమార్, సారయ్య, రాజారాం, విజేందర్ రెడ్డి, గడ్డం కుమార్, స్వామి, దొమ్మటి రాజమల్లు, రాయిశెట్టి కుమార్, మారం తిరుపతి రెడ్డి, కొల్లిపాక శ్రీనివాస్, ముర్త్రాల రఘువరన్, వెంకటేష్, దాగు అశోక్, కర్ణాకర్ రెడ్డి, దాసరపు రాజు, అశోక్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.



## ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం...

**- సీఎం రేవంత్ రెడ్డికి క్షీరాభిషేకం**

**సూర్య కరీంనగర్**




కరీంనగర్ జిల్లా ఇంటర్ విద్య జెఏసీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశపెట్టడాన్ని ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం. సత్యనారాయణ రెడ్డి, కార్యదర్శి లింగంపల్లి కనకయ్య హర్షించారు. ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపల్ సంఘం జిల్లా అధ్యక్షుడు టి. మహేందర్ కుమార్, కార్యదర్శి ఎ. సత్యనారాయణ జనేయులు మాట్లాడుతూ బడ్జెట్‌లో విద్యాశాఖకు పెద్దపీట వేయడం సంతోషకరమన్నారు. ఈ పథకం ద్వారా పేద, మధ్యతరగతి, బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు మేలు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వి.గంగాధర్, బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎ.నిర్మల, వి.ఆంజనేయరావు, సిహెచ్.శశిధర్ శర్మ పాల్గొన్నారు.

## తెలంగాణ డైట్ కాలేజీల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్

**సూర్య తిమ్మాపూర్**

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థలు (డైట్) మరియు ప్రైవేట్ విద్యా సంస్థల్లో రెండేళ్ల ఉపాధ్యాయ శిక్షణ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్-2026 నోటిఫికేషన్ విడుదలైంది. 2026-27 విద్యా సంవత్సరానికి గానూ డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లొమా ఇన్ ప్రీ-స్కూల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో అడ్మిషన్ల కోసం అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండి కాలనీలోని డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఇంటర్మీడియట్‌లో కనీసం 50% మార్కులతో ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 5 శాతం మినహాయింపు ఉండటంతో, వీరు 45% మార్కులతో దరఖాస్తు చేసుకోవచ్చు. సెప్టెంబర్ 1, 2026 నాటికి అభ్యర్థులకు 17 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ట వయోపరిమితి లేదు. ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కోర్సు తెలుగు, ఉర్దూ, మరియు ఇంగ్లీష్ మాధ్యమాల్లో అందుబాటులో ఉంటుంది. ప్రీ-స్కూల్ ఎడ్యుకేషన్ కోర్సు కేవలం ఇంగ్లీష్ మీడియంలో మాత్రమే ఉంటుంది. తెలుగు లేదా ఉర్దూ మీడియం ఎంచుకునే వారు పదో తరగతిలో ఆ భాషను మొదటి భాషగా లేదా ఇంటర్మీడియట్‌లో సెకండ్ లాంగ్వేజ్‌గా చదివి ఉండాలి. జనరల్ అభ్యర్థులకు రూ. 500, ఎస్సీ, ఎస్టీ మరియు దివ్యాంగులకు రూ. 450, ఆసక్తి గల అభ్యర్థులు ఏప్రిల్ 15, 2026 లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ http://deecet.cdse.telangana.gov.in ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

## నీటి వృధాతో భవిష్యత్‌లో నీటి కష్టాలు

**- సర్పంచ్ మహేష్**

**సూర్య, హుజురాబాద్ రూరల్**




ప్రతి ఒక్కరూ బాధ్యతగా నీటిని పొదుపుగా వాడాలని, నీటి వృధాతో భవిష్యత్తులో నీటి కష్టాలు వస్తాయని గ్రామ సర్పంచ్ ముప్పు మహేష్ అన్నారు. శుక్రవారం హుజురాబాద్ మండలం కందుగుల గ్రామంలో బాల వికాస ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ఆవరణలో ప్రపంచ నీటి దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నీటిని పొదుపుగా వాడుకోవాలని, నీటి నిల్వలను పెంచుకోవాలని, నీటిని వృధా చేయకూడదని అన్నారు. గ్రామంలో ఉన్న లీకేజీలను సరిచేస్తామని, నీటి నిల్వలను పెంచే కార్యక్రమాలను చేపడతానని, నీటిని వృధా చేయకుండా పొదుపుగా వాడాలని అన్నారు. బాలవికాస సంస్థ రూపాయికే నీటిని అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ మండ సతీష్, వార్డు సభ్యులు అరణ్య, విజయ్, మోడ్తల సాంబయ్య, స్కూల్ హెచ్ఎం సంజీవ రెడ్డి, ఇంచార్జీ ఏ. మమత, బాలవికాస కో ఆర్డినేటర్స్ రజిత, హైమావతి, కళ్యాణి, నజీమా తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ఓసి అందజేసిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్

**సూర్య జగిత్యాల**



జగిత్యాల రూరల్ మండలంలోని నర్సింగాపూర్ గ్రామానికి చెందిన నాగపురి సురేష్ గుండె సంబంధిత వ్యాధితో నిమ్స్ హాస్పిటల్‌లో ఉండగా గ్రామ నాయకులు ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ దృష్టికి తీసుకురాగా శుక్రవారం బాధితుని కుటుంబ సభ్యులకు ముఖ్య మంత్రి సహాయనిధి నుండి 2 లక్షల 50 వేల రూపాయల ఎల్ఓసినీ జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అందజేశారు.





# చిన్నారులకు గర్భిణీ స్త్రీలకు ఇచ్చే పౌష్టికాహారం నీళ్లపాలు

**- సంబంధిత అధికారుల పర్యవేక్షణ శూన్యం**

**- అంగన్వాడి నిర్వహకుల నిర్లక్ష్యం వల్లనే ఇది జరిగింది - సర్పంచ్ తులా మనోహర రావు**



**సూర్య కాల్వ శ్రీరాంపూర్**

కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని మొట్లపల్లి గ్రామంలో చిన్నారులకు, గర్భిణీ స్త్రీలకు అందవలసిన ఆరోగ్య పాల ప్యాకెట్లు కాలువలో పారబోసిన సంఘటన వెలుగులోకి వచ్చింది. చిన్నారులకు గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం అందించడంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ పోషణ పథకం ప్రవేశపెట్టి అంగన్వాడీ కేంద్రాలకు ఆరోగ్య పాలను పంపిణీ చేస్తుంది. గర్భిణీ స్త్రీలకు పిల్లలకు ఇవ్వవలసిన పాలు అంగన్వాడీ నిర్వాహకులు ప్రజలకు సరైన సమయంలో ఇవ్వనందున వాటి యొక్క వ్యాలిడిటీ పూర్తి కావడంతో గుట్టు చప్పుడు కాకుండ నీటి



పాలు చేస్తున్నారని స్థానిక సర్పంచ్ తులా మనోహర రావు పేర్కొన్నారు. అంగన్వాడి ఆరోగ్య పాలు నీటిపాలు చేయడంలో వారి ఉద్దేశ్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. సంబంధిత అధికారుల నిర్లక్ష్యం వలన అంగన్వాడీ నిర్వాహకులు ఇలాంటి సంఘటనలకు పాల్పడుతున్నారని తీవ్రంగా ఖండించారు. సంఘటన స్థలాన్ని బట్టి చూస్తే నీటి పాలైన పాల ప్యాకెట్లు సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం వల్లనే ఇలా జరి గిందని వారన్నారు. అధికారులు పాల ప్యాకెట్లు నీటిపాలు చేసిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఇది చూసిన స్థానికులు సైతం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ పాల ప్యాకెట్లు కాలువలో పారబోసిన వారి వివరాలు తెలియాల్సి ఉన్నది.

# నిర్ణీత గడువులోగా అభివృద్ధి పనులను పూర్తి చేయాలి

**- 15 రోజులలో సంగీత పాఠశాల అభివృద్ధి పనులు పూర్తి చేయాలి**

**- రామగిరి, మంథనిలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**

**సూర్య, సెంటినరీ కాలనీ**

నిర్ణీత గడువులోగా చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రామగిరి మండలం, మంథని పట్టణ పరిధిలో విస్తృతంగా పర్యటించారు. రామగిరి మండలంలోని కేజీబీవీ విద్యాలయం, నూతనంగా నిర్మించడానికి సిద్ధంగా ఉన్న తహసీల్దార్ భవన స్థలం కలెక్టర్ పరిశీలించారు. మంథని పట్టణంలోని సంగీత పాఠశాల, మున్సిపల్ కార్యాలయ, జూనియర్ బాయ్స్ స్కూల్, సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో జరుగుతున్న నిర్మాణ పనులను పరిశీలించారు. మంథని పట్టణంలోని షెడ్యూలు కులాల బాలికల వసతి గృహం,



ప్రభుత్వ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష రామగిరి కేజీబీవీలో నూతనంగా ఏర్పాటు చేసిన మాడ్యులర్ కిచెన్ ను ప్రారంభించారు. స్టీమ్ రైస్ బాయిలర్, ఆటోమేటిక్ రోటి మేకర్, ఇడ్లీ బాయిలర్, ఎల్.పీ.జి గ్యాస్ లైన్, 18 డైనింగ్ టేబుల్స్‌లను సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. రామగిరి తహసీల్దార్ కార్యాలయం నిర్మాణ పనులు త్వరగా ప్రారంభించాలని కలెక్టర్ సూచించారు.మంథని సంగీత స్కూల్ ప్రిన్సిపాల్ సూచనల మేరకు అభివృద్ధి పనులను 15 రోజులలో పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. పట్టణంలో నూతనంగా చేపడుతున్న పురపాలక కార్యాలయ నిర్మాణ పనులు నిర్దిష్ట గడువు లోగా పూర్తయ్యే విధంగా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. మంథని లోని జూనియర్ బాయ్స్ స్కూల్‌లో పెండింగ్ ఉన్న చిన్న చిన్న నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి మంత్రి చేతుల మీదుగా ప్రారంభించేందుకు సన్నద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గురుకుల పాఠశాలలో స్టేజ్, డార్మెటరీ, డైనింగ్ హాల్



వంటి అభివృద్ధి పనులు పూర్తి చేసామని, పాత స్కూల్ భవనం, హాస్టల్‌కు అవసరమైన మరమ్మతులు చేయించి పెయింటింగ్ వేయాలని కలెక్టర్ సూచించారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ రిన్నోవేషన్ భాగంగా పెయింటింగ్, అంతర్గత సిసి రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. నూతనంగా నిర్మిస్తున్న 50 పడకల ఆసుపత్రి పనులు స్లాబ్ దశలో ఉన్నాయని, వాటిని గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట రామగిరి తహసీల్దార్ పర్నంది సుమన్,మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్,టిజిఎంఎస్ఐడిసి ఈఈ విక్రమ్, పంచాయతీ రాజ్ ఈఈ శంకరయ్య, ఏఈలు అనుదీప్, వరలక్ష్మి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ స్థాయి సివిల్ సర్వీసెస్ సాంస్కృతిక పోటీల్లో

# ధర్మారం సి.హెచ్.ఓ వసంత్ ప్రతిభ

**సూర్య పెద్దపల్లి ప్రతినిధి**

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (CHO)గా విధులు నిర్వహిస్తున్న వి. వసంత జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్నారు. కేంద్ర సివిల్ సర్వీసెస్ సాంస్కృతిక మరియు క్రీడల బోర్డు (CCS CSB) ఆధ్వర్యంలో న్యూఢిల్లీలో జరుగుతున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ మ్యూజిక్, డాన్స్ & షార్ట్ ప్లే కాంపిటీషన్స్ (2025-26)లో భాగంగా తన బృందంతో కలిసి అద్భుత ప్రదర్శన కనబరుస్తున్నారు.గత ఏడాది నవంబర్ 6,7 తేదీల్లో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఎంపిక పోటీల్లో వసంత ప్రతిభ కనబరిచారు. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ మరియు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సెక్రటేరియట్ అసోసియేషన్ సంయుక్తంగా నిర్వహించిన ఈ పోటీల్లో జానపద నృత్య విభాగంలో రాష్ట్రం తరపున జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఈ నెల 20 నుండి 25 వరకు న్యూఢిల్లీలోని చాణ క్యపురి సివిల్ సర్వీసెస్ ఆఫీసర్స్ ఇన్‌స్టిట్యూట్‌లో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక పోటీలకు తెలంగాణ ఆరోగ్య రంగం నుండి, ముఖ్యంగా పెద్దపల్లి జిల్లా నుండి ఎంపికైన ఏకైక వ్యక్తిగా వసంత నిలిచారు. గతంలోనూ పలు జాతీయ స్థాయి శిక్షణ కార్యక్రమాలకు హాజరై ఇప్పుడు సాంస్కృతిక రంగంలో జిల్లా కీర్తిని దేశ రాజధానిలో చాటుతున్నారు.



## డీసీసీ సభ్యుడిగా పరమేశ్

**సూర్య - పెద్దపల్లి రూరల్**



టీపీసీసీ ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యుడిగా పెద్దపల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన సూత్రపు పరమేశ్‌ను నియామకమయ్యారు. టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ విడుదల చేసిన జిల్లా కార్యవర్గంలో ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా చోటు దక్కింది. పరమేశ్ నియామకం పట్ల పలువురు కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. కాగా తన నియామకానికి సహకరించిన పెద్దపల్లి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ విజయ రమణారావు, జిల్లా అధ్యక్షులు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్‌లకు పరమేశ్ కృతజ్ఞతలు తెలిపారు. విప్ విజయ రమణారావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని పరమేష్ తెలిపారు.

## రామగుండం సిపిని కలిసిన జిల్లా చైర్మన్

**సూర్య సుల్తానాబాద్**



రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ను శుక్రవారం పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, సుల్తానాబాద్ మున్సిపల్ వైస్ చైర్పర్సన్ అంతటి పుష్పలత సిపి చాంబర్లో మర్యాదపూర్వకంగా కలిసి సిపికి బోకెను అందించి శాలువాతో సన్మానించారు.

## ఎలిగేడు మండలంలో స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక పోటీలు

**సూర్య - ఎలిగేడు**



ఎలిగేడు మండల స్థాయి స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక పోటీలను శుక్రవారం ఎలిగేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించినట్లు మండల విద్యాధికారి ఏ. నరేంద్ర చారి తెలిపారు. ఈ పోటీలను ఎలిగేడు గ్రామ సర్పంచ్ కప్పల ప్రవీణ్, ఎంఈఓ ఏ. నరేంద్ర చారి జెండా ఊపి అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, స్పోర్ట్స్ స్కూల్లో సీటు సాధించిన విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి శిక్షణతో పాటు అనుభవజ్ఞులైన కోచ్‌ల పర్యవేక్షణలో అత్యాధునిక క్రీడా సదుపాయాలు అందుతాయని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ ఉన్న విద్యార్థులకు స్పోర్ట్స్ స్కూల్స్ ఒక గొప్ప అవకాశమని, ఈ ఎంపికల్లో ప్రతిభ కనబర్చిన వారిని జిల్లా స్థాయి పోటీలకు పంపిస్తామని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ దేవేందర్ రావు,



మండల వ్యాయామ ఉపాధ్యాయులు కె. ప్రణయ్,ఎల్.శ్రీనివాస్,వి. శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## లో వోల్టేజ్ సమస్య నివారణకు మినీ ట్రాన్స్‌ఫార్మర్లు

**- మంథని విద్యుత్ డిఈ వెగ్గలం ప్రభాకర్**

**సూర్య, సెంటినరీ కాలనీ**



లో-వోల్టేజ్ సమస్య నివారణకు మినీ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని మంథని విద్యుత్ డిఈ వెగ్గలం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం కల్వచెర్ల గ్రామపంచాయతీ పరిధిలో 25 కే.వికి చెందిన 3 మినీ ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏడీఈ వంగల వెంకటనారాయణ, సర్పంచ్ రేండ్ల శారదకుమారస్వామి, ఏఈ కొరండ్ల మహేందర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ప్రభుత్వం ప్రతి గ్రామంలో లో వోల్టేజ్ సమస్య లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశాలు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో వివిధ సమస్యలను పరిష్కరించాలని సర్పంచ్ రేండ్ల శారదకుమారస్వామి అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ కుమ్మరికుంట సతీష్ పటేల్,సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్ మౌలానా, లైన్ ఇన్స్పెక్టర్ ఉడుత భూమయ్య, లైన్ మెన్ ఆకుల శ్రీనివాస్, బంగారు శివకుమార్, ఏఎల్ఎం ఈశ్వరోజు ప్రభాకర్, వార్డు సభ్యులు కొట్టే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే - సీపీ వివాదం తారాస్థాయికి...

# అసెంబ్లీలో చర్చకు దారితీసిన వైనం..!

**సూర్య ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్యూరో**



ప్రభుత్వ వనరులను వ్యక్తిగత అవసరాలకు వినియోగిస్తున్నారని, ముఖ్యంగా పోలీస్ శాఖకు చెందిన వాహనాలను హైదరాబాదులో వ్యక్తిగత ప్రయోజనాల కోసం ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా, పోలీస్ వ్యవస్థను కొందరు వ్యక్తిగత ప్రయోజనాలకు వాడుకుంటున్నారని తీవ్రంగా విమర్శించారు. ఇక మరింత వివాదాస్పదంగా మారిన అంశం ఫైరింగ్ రేంజ్ ఘటన. సీపీ కుటుంబానికి సంబంధించిన వ్యక్తులు ఫైరింగ్ ప్రాక్టీస్ నిర్వహించే సమయంలో జరిగిన ఘటనలో ఓ వృద్ధురాలు గాయపడినట్లు ఎమ్మెల్యే ఆరోపించారు. ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న అధికారుల కుటుంబ సభ్యులు కూడా నియమాలు పాటించాలనే విషయాన్ని ఆయన లేవనెత్తారు. ఈ ఆరోపణల నేపథ్యంలో ఎమ్మెల్యే నేరుగా అసెంబ్లీలోనే ఈ విషయాన్ని ప్రస్తావించడం రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారి తీసింది. ప్రజాప్రతినిధి, ఉన్నతాధికారి మధ్య ఇలాంటి ఘర్షణ బయటపడటం అరుదైన విషయం కావడంతో రాజకీయ వర్గాలు, ప్రజలు ఆసక్తిగా గమనిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి నిజానిజాలు వెలికితీయాలని, పూర్తి స్థాయి విచారణ జరిపించాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. మరోవైపు, ఈ ఆరోపణలపై అధికారికంగా పోలీస్ విభాగం నుండి స్పష్టమైన స్పందన వెలువడకపోవడం కూడా చర్చకు కారణమవుతోంది. ఆరోపణలు నిజమా? లేక రాజకీయ కోణంలో వచ్చినవా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని పారదర్శక విచారణ చేపడితేనే వాస్తవాలు బయటపడతాయని, లేదంటే ఈ వివాదం మరింత ముదిరే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఎమ్మెల్యే--సీపీ మధ్య కొనసాగుతున్న ఈ ఘర్షణ ఎటు దారి తీస్తుందో అన్నది రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తిగా మారింది.

# నెల రోజుల భక్తి... ఏడాదంతా స్ఫూర్తి ..

**(మొదటి పేజి తరువాయి)**



కొత్త దుస్తులు ధరించి ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు చెప్పుకుంటారు. ఈ నేపథ్యంలో ఈద్గాహ్ వద్ద భారీ ఎత్తున ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. అనంతరం రంజాన్ పండుగ రోజున షీర్ ఖుర్మా చేసుకొని నోరు తీపి చేసుకుంటారు. ధనికులు, పేదలు అనే తారతమ్యం లేకుండా సమాజంలోని అందరూ ఒకే విధమైన దినచర్య పాటిస్తారు. ఈ పండుగ ఆరోగ్యకర పద్ధతులు, శాంతి, సౌభాగ్యాలను నెలకొల్పుతుందని నమ్మడు. పండుగ తర్వాత మరో ఆరు రోజుల పాటు షవ్వాల్ దీక్షలు పాటిస్తారు.

**- ప్రత్యేక దువా**

ముస్లింలు పండుగకు ముందు రోజు రాత్రి షవ్వాల్ నెల నెలవంక కనిపించిన తర్వాత ప్రత్యేక దువా (ప్రార్థన) చేస్తారు. అప్పటితో ఉపవాస దీక్షలు ముగుస్తాయి. ఈద్ ఉల్ ఫితర్ రోజు సూర్యోదయానికి ముందు నిద్రలేస్తారు. ఉదయం ఫజర్ నమాజ్ చేస్తారు. అందరూ సంప్రదాయ స్నానాలు (గుసుల్) చేస్తారు. అనంతరం కొత్త బట్టలు ధరిస్తారు. చాలా మంది లాల్చీ, పైజామా ధరిస్తారు. ఈద్ (పండుగ) రోజు ఉపవాసం ఉండకూడదని ఖురాన్ చెబుతోంది. ఈద్ ఉల్ ఫితర్ నమాజు కంటే ముందు 'జకాత్' చెల్లిస్తారు. ఇస్లాం ఐదు మూల స్తంభాల్లో జకాత్ నాలుగోది. పండుగ రోజున నమాజ్ కు ముందు పేదలకిచ్చే దానమే ఫిత్రా. అందుకే ఈ పండుగకు ఈద్ ఉల్ ఫితర్ అని పేరు వచ్చింది.

**- రంజాన్ స్పెషల్ 'షీర్ ఖుర్మా'**

రంజాన్ పండుగ రోజు అందరి దృష్టి షీరఖుర్మా' పైనే ఉంటుంది. పండుగ రోజు నమాజ్ ముగిశాక మిత్రులు, బంధువులు, ఆత్మీయులతో పంచుకునేందుకు వారందరిని ఇండ్లకు ఆహ్వానిస్తారు. వారికి షీర్ ఖుర్మాతో విడదీయరాని అనుబంధం ఉంది. ఉపవాసాలు, ఐదుపూటల నమాజ్, చివరి పది రోజుల్లో ఎతెఖాఫ్, షబే ఖదర్, జాగరణ రాత్రులతో నెల రోజుల పాటు ముస్లింలు ఆధ్యాత్మిక చింతనతో గడుపుతారు. చివరి రోజు ఉపవాస దీక్ష ముగిసిన తర్వాత ముస్లింలు సోదరభావంతో హిందువులకూ 'షీర్ ఖుర్మా' అందిస్తారు.

**- దానధర్మాలకు ప్రతీక:**

రంజాన్ మాసం అత్యంత నియమ, నిష్టలతో పవిత్ర రంజాన్ మాసపు ఉపవాస దీక్షలు చేపట్టి షవ్వాల్ నెలవంక చూసిన తర్వాత ఈద్ ఉల్ ఫితర్ పండుగ జరుపుకుంటాం. పేదల ఆకలి బాధలు తెలుసుకొని ఈద్ నమాజ్ కు ముందే ప్రతి ఒక్కరు విధిగా ఫిత్రా, జకాత్ చెల్లించాలి. ఇదే పవిత్ర రంజాన్ మాసం ఆశయం. ప్రేమ, కరుణ, సోదరభావం, పరమత సహనం ఇస్లాం ప్రధాన ఉద్దేశం. రంజాన్ మాసమంతా అనుక్షణం సర్వ మానవాళి సుఖ సంతోషాల కోసమే ప్రార్థిస్తాం. ఇస్లాం మూల సిద్ధాంతాలు కలిమా, నమాజ్, రోజా, జకాత్, హజ్ ఐదు అంశాలపై ఉన్నాయి. ఈ నెలలో దైవ ప్రార్థన, బీదలకు తనవంతు సాయం, ప్రేమాభిమానాలతో గడిపిన జీవన విధానం మిగిలిన 11 నెలలు పాటు ఆచరించాలని పవిత్ర ఖురాన్ లో అల్లాహ్ నిర్దేశించారు.

**- అల్లాహ్ సన్మార్గంలో ముస్లింలందరు నడవాలి.**

**- దివి నుంచి భువికి ఖురాన్**

ముస్లింలకు అతి పవిత్రమైన మాసం రంజాన్. ఖురాన్ గ్రంథం దివి నుంచి భూమికి ఈ మాసంలోనే వచ్చింది. ఈ నెలలో ఉపవాస దీక్షతో శరీరాన్ని శుద్ధి చేసుకోవడం ద్వారా ఆత్మ ప్రక్షాళన అవుతుంది. దీంతో మోహం, మదం, కోపతాపాలు అదుపులో ఉంటాయి. రంజాన్ మాసంలో ముస్లింలు అందరూ ఉపవాస దీక్షలు ఆచరించడం తప్పనిసరి. ఖురాన్లో సూచించినట్లుగా సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం వరకు 30 రోజుల పాటు పాటించే దీక్షల్లో చుక్క నీరు కూడా సేవించరు. ఇలా 30 రోజుల పాటు కఠోర నియమాలతో ఉపవాస దీక్ష చేస్తారు. ఉపవాస దీక్షలతో మనోనిగ్రహం కలుగుతుంది. ఆకలి విలువ తెలుస్తుంది. కోరికలు దహించుకుపోతాయి. ప్రేమ, అభిమానం, క్రమశిక్షణ, కర్తవ్యం తదితర గుణాలు దరి చేరతాయి. ఎన్నో ప్రత్యేకతలతో సాగే రంజాన్ మాసం ఈద్ ఉల్ ఫితర్ వేడుకలతో ముగుస్తుంది.

# నిర్ణీత గడువులోగా అభివృద్ధి పనులను పూర్తి చేయాలి

**(మొదటి పేజి తరువాయి)**



పట్టణంలోని షెడ్యూలు కులాల బాలికల వసతి గృహం, ప్రభుత్వ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంథని సంగీత పాఠశాల ప్రిన్సిపాల్ సూచనల మేరకు అభివృద్ధి పనులను 15 రోజులలో పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. పట్టణంలో నూతనంగా చేపడుతున్న పురపాలక కార్యాలయ నిర్మాణ పనులు నిర్దిష్ట గడువు లోగా పూర్తయ్యే విధంగా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. మంథని లోని జూనియర్ బాయ్స్ స్కూల్ లో పెండింగ్ ఉన్న చిన్న చిన్న నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి మంత్రి చేతుల మీదుగా ప్రారంభించేందుకు సన్నద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గురుకుల పాఠశాలలో స్టేజి, డార్మటరీ, డైనింగ్ హాల్ వంటి అభివృద్ధి పనులు పూర్తి చేసామని, పాత స్కూలు భవనం, హస్టల్ కు అవసరమైన మరమ్మతులు చేయించి పెయింటింగ్ వేయాలని కలెక్టర్ సూచించారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ రిన్నోవేషన్ భాగంగా పెయింటింగ్, అంతర్గత సిసి రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. నూతనంగా నిర్మిస్తున్న 50 పడకల ఆసుపత్రి పనులు స్లాబ్ దశలో ఉన్నాయని వీటిని గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్, టిజిఎంఎస్ఐడిసి ఈఈ విక్రమ్, పంచాయతీ రాజ్ ఈ ఈ శంకరయ్య, ఏఈ లు అనుదీప్,వరలక్ష్మి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సమన్వయంతో బాలికలకు హెచ్.పి.వి వ్యాక్సిన్

**- అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే**

**సూర్య కరీంనగర్ ప్రతినిధి**



వివిధ శాఖలు సమన్వయంతో పని చేస్తూ జిల్లాలో నిర్వహిస్తున్న హెచ్.పి.వి వ్యాక్సిన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే అన్నారు. విద్య, ఆరోగ్య, మహిళా సంక్షేమ శాఖ, డిఆర్డిఏ, ఎస్సీ ఎస్టీ సంక్షేమ తదితర శాఖల అధికారులతో హెచ్పీవీ వ్యాక్సిన్ పై సమన్వయ సమావేశం అడిషనల్ కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ జిల్లాలోని కరీంనగర్ మాతా శిశు, జమ్మికుంట, హుజరాబాద్ ఏరియా ఆసుపత్రిలో హెచ్పీవీ వ్యాక్సినేషన్ కొనసాగుతుందని తెలిపారు. ఈ ఆస్పత్రులకు సమీపంలోని పాఠశాలల్లో 14 సంవత్సరాలు నిండిన బాలికలకు టీకాలు వేయించాలని సూచించారు. అర్హులందరి జాబితా సిద్ధం చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. నిర్దిష్ట సమయం తేదీల ప్రకారం వ్యాక్సినేషన్ చేయించాలని తెలిపారు. స్వయం సహాయక సంఘాలు, అంగన్వాడి టీచర్లతో అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ఎమినైజేషన్ అధికారి సాజిత, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, బీసీ సంక్షేమ అధికారి అనిల్ ప్రకాష్, ఎస్సీ సంక్షేమ శాఖ డిడి నాగలేశ్వర్, ఆర్ ఎం ఓ నవీన తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి సంగీత పోటీలో పారమిత హెరిటేజ్ విద్యార్థుల ప్రతిభ

**సూర్య కరీంనగర్**



భారతదేశపు ప్రముఖ వర్చువల్ ఈవెంట్ సంస్థ అయిన గ్లిట్జ్, గ్లోరీ, పూణే ఆద్వర్యంలో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి సంగీత పోటీలలో స్థానిక నగరం లోని పద్మనగర్ పారమిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో పథకాలు సాధించారని పాఠశాల డైరెక్టర్ కె.హన్మంత రావు తెలిపారు. స్టార్స్ ఆఫ్ ఇండియా అవార్డ్స్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీ, దేశవ్యాప్తంగా ఉన్న నిజమైన ప్రతిభను గుర్తించే ఒక అత్యంత ప్రతిష్టాత్మక వేదిక. వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన పోటీదారులతో తలపడి, పారమిత హెరిటేజ్ పాఠశాల కు చెందిన 7వ తరగతి విద్యార్థి కిట్ల చరణ్ వాయిద్య సంగీత విభాగంలో మొదటి స్థానం సాధించగా, 9వ తరగతికి చెందిన ఎస్. శ్రీ సాన్విక గాత్ర సంగీత విభాగంలో రెండవ స్థానం సాధించారు. జాతీయస్థాయిలో అవార్డులు పొందిన విద్యార్థులను మరియు సంగీత ఉపాధ్యాయులను పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ.ప్రసాద రావు, డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రష్మిత, రాకేష్, వి.యు.యం. ప్రసాద్, వినోద్ రావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ హన్మంత రావు, ప్రధానోపాధ్యాయులు గోపీకృష్ణ, సమన్వయ కర్తలు రబీంద్రపాత్రో, భవానీ, నిఖిత, సంగీత ఉపాధ్యాయులు జితుమణి శర్మ, కిరణ్ లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణారావుకు ఘన స్వాగతం

**సూర్య కరీంనగర్**

పెద్దపల్లి ఎమ్మెల్యే చ. విజయ రమణారావు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్‌గా నియమితు లైన అనంతరం మొదటి సారిగా పెద్దపల్లికి వెళ్తున్న సందర్భంగా కరీంనగర్‌లో ఘన స్వాగతం లభించింది. నగరంలోని హౌసింగ్ బోర్డ్ కాలనీ బైపాస్ రోడ్ వద్ద కార్పొరేటర్ ఆకుల నందిని ఉదయ్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ తనకు ఈ బాధ్యత అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పెద్దపల్లి తో పాటు కరీంనగర్ నగరంలో కూడా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, నాయకులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఆకుల నర్మదా నర్సయ్య, గంట శ్రీనివాస్, పడాల శ్రీజ అజయ్, గుమ్మడి రాజకుమార్, పడిషెట్టి వసంత భూమయ్య, మాజీ కార్పొరేటర్ ఆకుల ప్రకాష్, సత్యనారాయణ రావు, సుదర్శన్, తోట రాజేందర్, నరసింహచారి, వాసు గౌడ్, ఇమ్రాన్, సూఫియాన్, ధుగ్గ మహేందర్, రేగొండ సందీప్, శ్రీధర్ రెడ్డి, కపిల్ మాధవ్, కార్తిక్, కౌశిక్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.



# రాణీ రుద్రమ స్టేడియం ను అభివృద్ధి చేయాలనీ జీఎంకు వినతి

**సూర్య, సెంటినరీ కాలనీ**

సెంటినరీ కాలనీలోని రాణి రుద్రమదేవి స్టేడియం ను అభివృద్ధి చేయాలనీ ఆర్జీ-3 జీఎం సుంకర మధుసూదన్ కు క్రీడాకారులు వినతి పత్రం అందజేశారు. క్రీడా ప్రాంగణంలో 2004 వ సంవత్సరంలో నల్ల మట్టిని తొలగిం చి మొరం, ఎర్ర మట్టి వేసి గ్రౌండ్ తయారు చేయడం జరిగిందని, కానీ కాలక్రమే ణా పైన ఉన్న ఎర్ర మట్టి వర్షానికి మరియు గ్రేడింగ్ చేయడం వల్ల మొత్తం ఎర్రమట్టి పోయి మొరం పైకి తేలిందని తెలిపారు. మొరం లోని రాళ్ల వల్ల గ్రౌండ్ లో క్రీడల నిర్వహణ ఇబ్బందిగా మారిందని, కావున ఎర్ర మట్టిని వేసి గ్రౌండ్ ని చదును చేయాలనీ, స్టేడియంలో టెన్నిస్ కోర్టు లేని కారణంగా సింగరేణి డబ్ల్యుపిఎస్ అండ్ జిఎ క్రీడల నిర్వహణ సమయంలో గత 20 సంవత్సరాల పైగా ఆర్జీ-2 డివిజన్ లోని టెన్నిస్ కోర్టులో మన క్రీడలు నిర్వహించుకోవడం జరుగుతుందని, బాస్కెట్ బాల్ కోర్ట్ వెనకాల ఉన్న ఖాళీ స్థలంలో క్లే టెన్నిస్ కోర్ట్ ఏర్పాటు చేయాలని తెలిపారు. స్టేడియంలో నెట్స్ వేయడం జరిగింది కానీ అవి సరైన పద్ధతిలో వేయకపోవడం వల్ల నిరుపయోగంగా ఉన్నాయని, కావున క్రికెట్ నెట్స్ ను సరిచేసి ఉపయోగంలోకి తేవాలని కోరారు. స్విమ్మింగ్ పూల్ వెనుక భాగము ప్రహరీ గోడ కొంత భాగం లేదని, ప్రహరీ గోడ ని నిర్మించాలని కోరారు. సింగరేణి లోని అన్ని ఏరియాలలో సీఈఆర్ క్లబ్, షటిల్ కోర్ట్ విడివిడిగా ఉన్నాయి కానీ సెంటినరీ కాలనీలోని షటిల్ కోర్ట్ ని సీఈఆర్ క్లబ్ గా ఉపయోగించుకుంటున్నామని తెలిపారు. షటిల్ కోర్టు అనుకొని కొన్ని రూమ్స్ ఏర్పాటు చేస్తే సీఈఆర్ క్లబ్ గా ఉపయోగించుకోవచ్చని తెలిపారు. రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలోని వాకింగ్ ట్రాక్ దాదాపుగా 850 మీటర్లు ఉంటుంది కానీ చాలాకాలంగా వాకింగ్ ట్రాక్ గుంతలతో ఉండటం వల్ల వాకింగ్ చేయడానికి ఇబ్బందిగా ఉందని, వాకింగ్ ట్రాక్ ను చదును చేయాలని కోరారు. వాకింగ్ ట్రాక్ చుట్టూ మరియు గ్రౌండ్ లోనే ఖాళీ స్థలాలలో పిచ్చి మొక్కలు ఎక్కువగా ఉన్నాయని, దాని వల్ల కొన్నిసార్లు పాములు కూడా కనబడుతున్నాయని, గ్రౌండ్ లోని పిచ్చి మొక్కలను తొలగించి గ్రౌండ్ ను శుభ్రంగా ఉంచాలని తెలిపారు. గత రెండు సంవత్సరాల నుండి ఓపెన్ జిమ్ శాంక్షన్ అయిందని చెప్పడం జరుగుతుందని, డిసెంబర్-2025 కల్లా ఏర్పాటు చేస్తామన్నారు కానీ ఇప్పటివరకు ఏర్పాటు చేయలేదని, దానిని వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో క్రీడాకారుల సౌకర్యార్థం ఒక ప్రాక్టీస్ వాల్ నిర్మించాలని, రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణం 2004 లో ఏర్పాటు అయిన దగ్గరి నుండి ఇప్పటివరకు సింగరేణి కంపెనీ ఏర్పాటు చేసిన పోలీస్ రిక్రూట్మెంట్ క్యాంప్స్, ఆర్మీ రిక్రూట్మెంట్ క్యాంప్స్ లలో సింగరేణి కార్మికుల పిల్లలు, చుట్టుపక్కల ఉన్న గ్రామాల యువత ఈ ట్రైనింగ్ క్యాంపుల్లో శిక్షణ తీసుకొని ఎంతో మంది యువత ఈరోజు పోలీస్ ఉద్యోగులుగా, ఎస్సైలుగా, ఇండియన్ ఆర్మీ ఉద్యోగులుగా పనిచేయుచున్నారని తెలిపారు. కొంతమంది కార్మికులు అనారోగ్యంతో బాధపడుతూ బీపీ, డయాబెటిస్ ఉన్నవాళ్లు ప్రతిరోజు గ్రౌండ్ కు రావడం వాకింగ్ చేయడం వలన వారి యొక్క ఆరోగ్యాన్ని సరి చేసుకుంటున్నారని, ఎందరికో ఉపయోగకరంగా ఉన్న సెంటినరీ కాలనీ లోని రాణీ రుద్రమ దేవి స్టేడియం ను అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు పాల్గొన్నారు.



# జిడికె-11 వ బొగ్గు గనిలో రికార్డు ఉత్పత్తి

**- ఒక్క రోజులో 138 శాతం సాధన**

**సూర్య-గోదావరిఖని:**

సింగరేణి కాలరీస్ పరిధిలోని రామగుండం ఏరియా-1 జిడికె-11 భూగర్భ గనిలో రికార్డు స్థాయి రోజువారీ బొగ్గు ఉత్పత్తి నమోదైంది. నిర్దేశించిన లక్ష్యం 2916 టన్నులు కాగా, దాన్ని అధిగమిస్తూ 4025 టన్నుల ఉత్పత్తి సాధించి 138 శాతం ప్రగతి నమోదు చేయడం విశేషం. 2025-26 ఆర్థిక సంవత్సరంలో సంస్థలోని అన్ని భూగర్భ గనుల్లో ఇదే అత్యధిక రోజువారీ ఉత్పత్తిగా నిలిచింది. ఈ విజయాన్ని పురస్కరించుకుని ఏరియా-1 జనరల్ మేనేజర్ డీ.లలిత్ కుమార్ జిడికె-11 ఇంక్లైన్ గనిని శు క్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా గనిలోని అధికారులు, సూపర్వైజర్లు, ఉద్యోగులు, యూనియన్ నాయకులను ప్రత్యేకంగా అభినందించి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిఎం మాట్లాడుతూ గనిలో యంత్రాలు సుమారు 20 గంటలపాటు నిరంతరం పనిచేయడం వల్లే ఈ ఘన విజయం సాధ్యమైందని తెలిపారు. ముఖ్యంగా కంటిన్యూస్ మైనర్ 2వ విభాగం 200 శాతం లక్ష్యాన్ని చేరుకోవడం విశేషమని అన్నారు. ఆపరేటర్లు, టెక్నీషియన్లు, సూపర్వైజర్లు, అధికారులు, కాంట్రాక్టర్లు సహా గనిలోని ప్రతి ఉద్యోగి సమిష్టి కృషి ఫలితమే ఈ రికార్డు అని కొనియాడారు. ఈ సందర్భంగా మరమ్మత్తులు పూర్తయిన జిడికె-11 గని మేనేజర్ కార్యాలయాన్ని ప్రత్యేక పూజలు నిర్వహించి జిఎం ప్రారంభించారు. ఇంకా ఈ కార్యక్రమంలో గుర్తింపు సంఘం ఎఐటియుసి డిప్యూటీ జనరల్ సెక్రటరీ మడ్డి ఎల్లయ్య, గని ఏజెంట్ చిలుక శ్రీనివాస్, మేనేజర్ మల్లేశం, గ్రూప్ ఇంజనీర్ రాందాస్, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ వేణు, రక్షణ అధికారి మల్లేష్, ఫిట్ ఇంజనీర్ రాకేష్, ఎఐటియుసి నాయకులు రంగు శ్రీను, నాయిని శంకర్, ఫ్రీ షిఫ్ట్ ఇంచార్జ్ క్రాంతి, సూపర్వైజర్ వేణు, ఆపరేటర్లు శ్రీనివాస్, అశిష్, అశోక్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# మోసపూరిత కాల్స్ వస్తే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలి

**- ఆన్ లైన్ మోసాల పై అవగాహన పెంచుకోండి - రామగిరి ఏఎస్ఐ ఈదునూరి స్వామి**

**సూర్య, సెంటినరీ కాలనీ 05 :**

మోసపూరిత కాల్స్ వస్తే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని రామగిరి ఏఎస్ఐ ఈదునూరి స్వామి అన్నారు. రామగిరి మండల పోలీస్‌స్టేషన్ పరిధిలోని బేగంపేట గ్రామంలో శుక్రవారం పోలీసులు సైబర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ ఈదునూరి స్వామి మాట్లాడుతూ అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, ఓటీపీలు, బ్యాంక్ వివరాలు, లింకులు వంటి విషయాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కేవలం ఒక చిన్న నిర్లక్ష్యం వల్ల బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు మాయం అవుతున్న ఘటనలు ఎక్కువవుతున్నాయని తెలిపారు. సోషల్ మీడియా, వాట్సాప్, టెలిగ్రామ్ వంటి మాధ్యమాల ద్వారా వచ్చే సందేశాలను ధృవీకరించకుండా స్పందించవద్దని హెచ్చరించారు. అనుమానాస్పద లింకులు క్లిక్ చేయకూడదని, అధికారిక యాప్‌లు మాత్రమే ఉపయోగించాలని, ఏమైనా మోసపూరిత కాల్స్ లేదా సందేశాలు వస్తే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామస్తులు ఆసక్తిగా పాల్గొని సందేహాలు అడిగి తెలుసుకున్నారు. పోలీసులు ఇలాంటి అవగాహన కార్యక్రమాలను మరింతగా నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ లఖన్, కానిస్టేబుల్ ముత్తమల్ల రమేష్, హోంగార్డు మధునయ్య, తదితరులు పాల్గొన్నారు.



## ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలి

**- మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ**



ఈ నెల 23న సోమవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు ఆదేశాల మేరకు ఉచిత ఆరోగ్య పరీక్షలు మండలంలోని గర్రెపల్లి పి హెచ్‌సిలో నిర్వహిస్తున్నట్లు సుల్తానాబాద్ మున్సిపల్ చైర్మన్ బిరుదు రాధాకృష్ణ పేర్కొన్నారు. గైనకాలజిస్ట్,శిశు వైద్యులు, దంత వైద్యులు, నేత్ర వైద్యులు,ఆర్థోపెడిషియన్, సాధా రణ వైద్యుల పర్యవేక్షణలో వైద్య సేవలు అందించడం జరుగుతుందని, 30 రకాల ఉచిత పరీక్షలు నిర్వహిస్తారని మండలంలోని ప్రజలందరూ అవకాశాన్ని వినియోగించుకొని వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.

## పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా గాండ్ల మోహన్ నియామకం

**సూర్య, సెంటినరీ కాలనీ**



పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గంలో కమాన్‌పూర్ మండల కేంద్రానికి చెందిన గాండ్ల మోహన్‌కు జిల్లా కార్యదర్శి బాధ్యతలు అప్పగించడంతో పార్టీ వర్గాల్లో ఆనందం వ్యక్తమైంది. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ ప్రకటించిన జిల్లా కమిటీలో, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ఆధ్వర్యంలో మోహన్‌కు ఈ బాధ్యతలు కల్పించారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన గాండ్ల మోహన్ రాజనీతి శాస్త్రంలో పీజీ చదివిన విద్యావంతుడు. గతంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధికార ప్రతినిధిగా, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. సుదీర్ఘ రాజకీయ అనుభవం, సామాజిక అనుబంధం దృష్ట్యా రాబోయే ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఈ బాధ్యతలు అప్పగించారని పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ సందర్భంగా మోహన్ తనపై నమ్మకం ఉంచిన రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని, ప్రజల సమస్యల పరిష్కారానికి అంకితభావంతో పని చేస్తానని ఆయన పేర్కొన్నారు.



## ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు

**- మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన వాల బాలకిషన్ రావు**

**సూర్య, వీణవంక**

పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని వీణవంక మండల కేంద్రంలోని చల్లూరు గ్రామంలో మత సామరస్యం వెల్లివిరిసింది. మాజీ మార్కెట్ చైర్మన్ వాల బాలకిషన్ రావు ఆధ్వర్యంలో స్థానిక ముస్లిం మత పెద్దలకు, సోదరులకు ఘనంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ?ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ మసీదుల ఇమామ్‌లు, మత పెద్దలు, ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలకిషన్ రావు స్వయంగా వారికి వడ్డించి, రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా అందరూ కలిసి మెలిసి ఉండాలనే సంకల్పంతో ఈ విందును ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, దేశం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. తమను గౌరవించి, ఇంతటి ఘనమైన విందును ఏర్పాటు చేసినందుకు ముస్లిం సోదరులు బాలకిషన్ రావుకి ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రముఖులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# ఉద్యోగులకు నగదు రహిత వైద్య సేవలు

**- రూ.1056 కోట్లు కేటాయింపు - ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపిన ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్**

**- అసోసియేషన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ చిలువేరి ఉదయ ప్రసాద్**

**సూర్య కోరుట్ల**

తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు డిజిటల్ హెల్త్ కార్డుల ద్వారా నగదు రహిత వైద్య సేవలు అందించేందుకు రూ.1056 కోట్లు కేటాయించడం పట్ల తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు అసోసియేషన్ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ చిలువేరి ఉదయ ప్రసాద్ ముఖ్యమంత్రి మరియు ఆర్థిక మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రభుత్వంతో పాటు 421 ఎంపానెల్డ్ ప్రైవేట్ ఆసుపత్రుల్లో అమలు కానున్న ఈ పథకం ద్వారా సుమారు 23.51 లక్షల మందికి 1998 రకాల వ్యాధులకు నగదు రహిత వైద్య సేవలు అందనున్నాయని ఆయన పేర్కొన్నారు. వైద్య ఆరోగ్య శాఖకు రూ.13,679 కోట్లు కేటాయించడం కూడా అభినందనీయమని అన్నారు. అయితే, ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన కోరారు. ముఖ్యంగా 2వ పీఆర్‌సీ అమలులో 33 నెలల ఆలస్యం కారణంగా ఉద్యోగులు ఆర్థికంగా నష్టపోయారని, 51 శాతం ఫిట్‌మెంట్‌తో వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు విడుదల చేయడం, అన్ని బిల్లులు క్లియర్ చేయడం, 2024 మార్చి నుంచి రిటైర్ అయిన ఉద్యోగుల బకాయిలు చెల్లించడం వంటి అంశాలను కూడా ప్రభుత్వం తక్షణం



పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.అలాగే, ఎంహెచ్ఎస్ఆర్‌బీలో పెండింగ్‌లో ఉన్న 732 ఫార్మసీ ఆఫీసర్స్ మరియు ఇతర క్యాడర్లకు సంబంధించిన ప్రొవిజనల్ మెరిట్ లిస్ట్ విడుదల చేసి నియామక ఉత్తర్వులు ఇవ్వాలని, 104 సర్వీస్‌లో పనిచేసిన సిబ్బందికి 11 నెలల వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కూడా డిమాండ్ చేశారు.ప్రభుత్వం ఈ అంశాలను సానుకూలంగా పరిశీలించి ఉద్యోగులు, పెన్షనర్లకు న్యాయం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## జి పి లో సర్పంచ్ తో సమావేశమైన డి ఎల్ పి వో


**- ఎలిగేడు మండలంలో డీఎల్పీవో పర్యటన**



మండలం లోని పలు గ్రామాలలో జరుగుతున్న పారిశుధ్య, వివిధ అభివృద్ధి పనులను డి ఎల్ పి వో దేవకీదేవి సందర్శించి పరిశీలిం చారు. ఈ సందర్భంగా మండల కేంద్రం లోని ఎలిగేడు, రాములపల్లి గ్రామాల్లో ప్రత్యేకంగా గ్రామాల్లో తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరి ంచే విదంగా ప్రజల ను ఆ దిశ గ నడిపించాలన్నారు. గ్రామ నర్సరీల అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు.ప్లాస్టిక్ వినియోగంపై కఠిన చర్యలు తీసుకోవాలని,ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ గ్లాసులను పూర్తిగా నిషేధించాలని ఆమె సంబందించిన జి పి కార్యదర్శులను ఆదేశించారు. హోటళ్లు, షాపులు, టీ దుకాణాల్లో ప్లాస్టిక్ గ్లాసుల వినియోగం ఆరోగ్యానికి హానికరమని, వీటి వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్లాస్టిక్ గ్లాసులు అమ్మేవారిపై, వినియోగించే వారిపై జరిమానాలు విధించాలని సంబంధిత అధికారులకు సూచించారు.గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేయాలని, ప్రజల భాగస్వామ్యంతో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. ఈ క్రమంలో ఎం పి వో కిరణ్ సర్పంచులు కప్పల ప్రవీణ్, ఉప సర్పంచ్ ముంజం నరేష్, సిద్ది తిరుపతి ఉప విద్యాలత జి పి కార్యదర్శులు అంజలి, హరి బాబు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## నిధులు ఉన్నాయి.. హద్దులు చూపండని తహసీల్దార్‌కు వినతి.

**సూర్య,రాయికల్**



మంజూరైన నిధులు ఉన్నప్పటికీ భూమి సరిహద్దుల వివాదంతో రోడ్డు పనులు నిలిచిపోవడంతో మైతాపూర్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు.సమస్యను వెంటనే పరిష్కరించి పనులు పూర్తిచేయాలని కోరుతూ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మైతాపూర్ గ్రామంలోని శ్రీ గిరిగుట్ట (గన్నేగుట్ట)పై సుమారు ముప్పై ఏళ్ల క్రితం నిర్మించిన కనకదుర్గాదేవి ఆలయానికి మెయిన్ రోడ్డునుంచి సిమెంట్ రహదారి నిర్మాణానికి రాజ్యసభ సభ్యులు దామోదరరావు తన నిధుల నుంచి రూ.15 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు.ఈ నిధులతో రహదారి పనులు ప్రారంభమైనప్పటికీ, మధ్యలో భూమి పట్టాదారులు అడ్డుపడటంతో పనులు నిలిచిపోయినట్లు పేర్కొన్నారు.భూమి సరిహద్దుల విషయంలో స్పష్టత లేకపోవడంతో వివాదం నెలకొన్నదని,రెవెన్యూ శాఖ అధికారులు,సర్వే అధికారులు గ్రామానికి వచ్చి సరిహద్దులు నిర్ణయిస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. లేనిపక్షంలో మంజూరైన నిధులు వినియోగం కాకుండా తిరిగి వెనక్కి వెళ్లే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. భూమి సరిహద్దుల సమస్యను తక్షణమే పరిష్కరించి రహదారి పనులు పూర్తి చేయాలని వార్డు సభ్యులు బత్తిని శ్రీనివాస్, తొగిటి నవీన్,అనుమల్ల రమ,బూస గంగామల్లయ్య,భూపల్లి పరమేష్,స్థానిక నాయకులు సత్యనారాయణ లు తహసీల్దార్‌ను కోరారు.



## వీర హనుమాన్ విజయాత్ర కరపత్రం ఆవిష్కరణ

**సూర్య, రాయికల్**

విశ్వహిందూ పరిషత్ బజరంగ్దళ్ సంయుక్తంగా రాయికల్ గ్రామంలో ఈనెల 29 నాడు నిర్వహించే వీర హనుమాన్ విజయాత్ర కరపత్రంను నాయకులు రాయికల్ హనుమాన్ దేవస్థానం ప్రాంగంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంకు హిందువులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని,పార్టీల కతీతంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విశ్వహింద పరిషత్ జిల్లా సత్సంగ్ ప్రముఖ్ కాయితీ గంగాధర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు మహేష్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్,బజరంగ్ దళ్,విశ్వహిందూ పరిషత్ నాయకులు గుండేటి రాఘవ,కురుసంగా వేణు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు..

**సూర్య బోయినపల్లి ..**



మండలం తడగొండలో ముస్లిం సోదరులకు బిఆర్ఎస్ నాయకులు జోగిని పల్లి శ్రీనివాసరావు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు . రంజాన్ నెల ప్రారంభం నుండి ఉపవాస దీక్షలు ఉంటున్న ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని వారు అన్నారు. పలువురు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉయ్యాల శ్రీనివాస్, ఉప సర్పంచ్ చేపురి వెంకటేష్, హైమద్ హుస్సేన్, మహమ్మద్ హుస్సేన్, ఇస్మాయిల్ ఇబ్రహీం లతీఫ్ హకీమ్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సమైక్య భవనానికి భూమి పూజ

**- భూమి పూజ చేస్తున్న సర్పంచ్ మల్లు గారి పద్మ**

**సూర్య గంభీరావుపేట**

గంభీరావుపేట మండల కేంద్రంలో శుక్రవారం మహిళా సమాఖ్య సంఘ భవన నిర్మాణానికి గ్రామ సర్పంచ్ మల్లుగారి పద్మ భూమి పూజ చేశారు. మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం భవనాలు నిర్మిస్తుందని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్ వార్డు సభ్యులువార్డు సభ్యులు దేవసాని కృష్ణ, గ్యార దేవరాజు పిట్ల శ్రీమతి, నరేష్, మాజీ జెడ్పిటిసి మల్లు గారి నరసయ్య గౌడ్, ఏఎంసి డైరెక్టర్ కోటిలింగం గ్రామైక్య సంఘం మహిళలు పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.





## ఆరు గ్యారెంటీల అమలుకై బిజెపి ధర్నా

**సూర్య సిరిసిల్ల టౌన్**

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిరిసిల్ల జిల్లా భారతీయ జనతా పార్టీ నాయకులు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు.కార్యకర్తలు జిల్లా కలెక్టర్ ప్రధాన కార్యాలయం ముందుకి దూసుకు రావడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలపై భారతీయ జనతా పార్టీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించింది.రెండున్నర సంవత్సరాలు గడిచినా కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు ప్రధాన హామీలు,వందల సంఖ్యలో ఇచ్చిన వాగ్దానాలు ఇప్పటికీ అమలు కాలేదని బీజేపీ నేతలు ఆరోపిస్తున్నారు.విద్యార్థులకు ఇవ్వాల్సిన విద్యార్థి భృతి,నిరుద్యోగ భృతి ఇంకా అందలేదని, జాబ్ క్యాలెండర్ విడుదల విషయంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు.ఇక రైతుల పరిస్థితి దారుణంగా ఉందని,రైతు భరోసా ఎన్నికల సమయంలో మాత్రమే గుర్తుకు వస్తోందని విమర్శించారు.మహిళలకు ప్రకటించిన కల్యాణ లక్ష్మీ,తులం బంగారం వంటి పథకాల అమలు ఎక్కడుందో చెప్పాలని ప్రశ్నించారు. ప్రభుత్వం హామీలు నెరవేర్చే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.



## బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం

**సూర్య, ఇల్లందకుంట**

అపర భద్రాద్రిగా పేరుగాంచిన ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 25 నుండి ఏప్రిల్ 6 వరకు జరగనున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని హుజురాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అధికారులను కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈసారి బ్రహ్మోత్సవాలకు సుమారుగా లక్షకు పైగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సదుపాయాలను ఏర్పాటు చేయాలని దానికి అన్ని శాఖల అధికారులు ఒకరినొకరు కోఆర్డినేషన్ చేసుకుంటూ సమిష్టిగా పని చేయాలని కోరారు. క్యూలైన్లు మొదలుకొని పార్కింగ్ సానిటరీ విద్యుత్ దీపాలు ఎల్ఈడి స్క్రీన్లు మంచినీరు తదితర సౌకర్యాలపై అధికారులు దృష్టి సారించాలన్నారు.అత్యంత వైభవంగా జరిగే ఈ బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ప్రతి అధికారి ప్రత్యేక శ్రద్ధ చూపించాల న్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డితో పాటు అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్, డిసిపి వెంకటరమణ, ఏ సి పి మాధవి, ఆర్డీవో రమేష్ బాబు, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ, దేవస్థాన రేనోవేషన్ కమిటీ చైర్మన్ ఇంగిలే రామారావు, ఆలయ కార్యనిర్వాహణాధికారి కందుల సుధాకర్, సర్పంచ్ దార సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎగువ మానేరులో దూకి యువకుడి ఆత్మహత్య

**- గత నెల 22న పెళ్లి, అంతలోనే విషాదం**

**సూర్య గంభీరావుపేట**



గంభీరావుపేట మండలం నర్మాల ఎగువ మానేరు జలాశయంలో దూకి ఓ యువకుడు శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం ఘణపురం గ్రామానికి చెందిన దుంపటి వినయ్ కుమార్ (31) అనే యువకుడు మానేరు జలాశయంలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు.మానేరు జలాశయం వద్ద ద్విచక్ర వాహనాన్ని గుర్తించిన కుటుంబీకులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ పి.అనిల్ కుమార్ పోలీస్ సిబ్బందితో ప్రాజెక్టు వద్దకు చేరుకొని గాలింపు చర్యలు ముమ్మరం చేయడంతో సాయంత్రం యువకుడి మృతదేహం లభ్యం అయింది. మృతుడు వినయ్ కుమార్,విజయ్ కుమార్ లు ఇద్దరు కవలలు. గత నెల 22న ఇద్దరు కవల యువతులతో వివాహం జరిగింది. ఇంతలోనే విషాదం చోటు చేసుకుంది.మృతుడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

# బసంత్ నగర్ విద్యుత్ ఏఈపై చర్యలు తీసుకోవాలి....

### - ఎస్ ఈ కీ ఫిర్యాదు చేసిన యూనియన్ నాయకులు

**సూర్య - పెద్దపల్లి రూరల్**

టీజీ ఎన్పీడీసీఎల్ పెద్దపల్లి సర్కిల్ పరిధి బసంత్ నగర్ ఆపరేషన్ ఏఈ మానాల ప్రసాద్ పై చర్యలు తీసుకోవాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్. స్వామి డిమాండ్ చేశారు. విద్యుత్ సబ్ స్టేషన్లలో పని చేస్తున్న ఆపరేటర్ల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తూ బెదిరిస్తున్నారని ఏఈ ప్రవర్తన సరిగా లేదని విచారణ జరిపి శాఖా పరమైన చర్యలు చేపట్టాలని శుక్రవారం పెద్దపల్లి మండలం రాఘవపూర్ లో గల ఎస్ఈ కార్యాలయం ఎదుట ఆపరేటర్లు, యూనియన్ నాయకులతో కలిసి నిరసన తెలిపారు. ఆపరేటర్లను కక్ష్య



పూరితంగా వేధిస్తున్నారని ఎస్ఈ గంగాధర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ ఏఈ తీరుతో సబ్ స్టేషన్లలో పనిచేసే ఆపరేటర్లు భయాందోళన చెందుతున్నారని వాపోయారు. నిబంధనలకు విరుద్ధంగా రాత్రి వేళల్లో మద్యం మత్తులో ఏఈ సబ్ స్టేషన్ లను సందర్శించి ఆపరేటర్లను ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఏఈ వైఖరిపై తక్షణమే విచారణ జరిపి ఆపరేటర్లకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో టీజీ ఎన్పీడిసిఎల్ కంపెనీ ప్రెసిడెంట్ జి.ఆంజనేయులు, రీజనల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాగు నాయక్, సిహెచ్ నర్సయ్య, డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండయ్య, కె.నరేష్, పెద్దపల్లి సర్కిల్ గౌరవ అధ్యక్షులు భిక్షపతి, మంథని డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాస్ రెడ్డి, దేవేందర్, సర్కిల్ పరిధిలోని ఆపరేటర్లు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధిలో కీలకం సిసి రోడ్లు

**- దాదాపు 3 లక్షల వ్యయంతో నిర్మాణం**

**- ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే మా లక్ష్యం సర్పంచ్ రేకుల జ్యోతి రఘు**

**సూర్య కాల్వ శ్రీరాంపూర్**



కాల్వ శ్రీరాంపూర్ మండలం లోని గంగారం గ్రామంలో అభివృద్ధికి కీలక మైన సిసి రోడ్లను స్థానిక సర్పంచ్ రేకుల జ్యోతి రఘు మరియు మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్ లు ప్రారంభిం చారు. 25 మీటర్ల పొడవు గల రోడ్డు దాదాపు 3 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న ఈ సీసీ రోడ్డు గ్రామ ప్రజలకు ఉపశమనం కలిగించనున్నది. ఈ రోడ్ల నిర్మాణం వల్ల రవాణా సౌకర్యం మెరుగుపడి, దినసరి కార్యకలాపాలు సులభతరం కానున్నాయి. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రోడ్లు గ్రామ అభివృద్ధికి వెన్నెముక లాంటివనీ ఇవి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగు పరుస్తాయని అన్నా రు. ఈ సీసీ రోడ్ల నిర్మాణం ద్వారా రాకపోకలు సులభతరం అవుతాయని ,ముఖ్యంగా వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బంది లు తగ్గుతాయని, ఇలాంటి కార్యక్ర మాలు చేయడం పట్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్ర మంలో స్థానిక సర్పంచి తో పాటు మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య, జడ్పిటిసి లంక సదయ్య, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజన వేన సదయ్య,గ్రామ ఉపసర్పంచ్ మేడి అశోక్ తో పాటు వార్డు సభ్యులు, గ్రామ కార్యదర్శి షాబుద్దీన్, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధు లు, అధికారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సన్ షైన్ పాఠశాల పెగడపల్లి ఆధ్వర్యంలో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదాన వితరణ

**సూర్య కాల్వ శ్రీరాంపూర్**




శ్రీరాంపూర్ మండలంలోని పెగడ పల్లి గ్రామంలో గల సన్ షైన్ పాఠశాల వారి ఆధ్వర్యంలో పాఠ శాల కరస్పాండెంట్ సయ్యద్ నజీర్ మరియు లయన్స్ క్లబ్ సహకారం తో పెద్దపల్లి ప్రభు త్వమాత శిశు ఆసుపత్రిలో అన్నదాన వితరణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చే పేద, నిరుపేద కుటుంబాలకు ఈ కార్యక్రమం ఉపశమనం ఇస్తుందని రోగులు హర్ష వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ సయ్యద్ నజీర్ మాట్లాడుతూ అన్నదానం చేయడం ఆనందాన్ని ఇచ్చిందని, ఆకలితో ఉన్నవారికి భోజనం పెట్టి అవకాశం రావడం దేవుని కృపగా భావిస్తున్నా నని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది లైన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

## నవోదయ ఫలితాలలో మెరిసిన కృష్ణవేణి ఛాంప్స్ విద్యార్థులు

**సూర్య, సెంటినరీ కాలనీ**



రామగిరి మండలం కలవచర్ల గ్రామంలోని కృష్ణవేణి ఛాంప్స్ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు జవహర్ నవోదయ విద్యాలయ 2026-27 విద్యా సంవత్సరానికి నిర్వహించిన 6వ తరగతి ప్రవేశ అర్హత పరీక్షలో ప్రతిభ కనబరిచి సీట్లు సాధించారు. ఈ విజయాన్ని సాధించిన విద్యార్థులు బోడిగే ప్రజ్ఞయ, గరిగంటి మురారి, బాలసాని హార్దిక్ లను పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో కరస్పాండెంట్ చందుపట్ల తిరుపతి రెడ్డి, ప్రధానోపాధ్యాయులు బర్ల శ్రీనివాస్ విద్యార్థులను సత్కరించారు. నవోదయ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించడం సాధారణ విషయం కాదని, దీని కోసం కఠినమైన శ్రమ అవసరమని వారు పేర్కొన్నారు. కృషి, పట్టుదలతో విజయాన్ని సాధించిన ఈ విద్యార్థులు తమ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాలకు గౌరవాన్ని తీసుకువచ్చారని కొనియాడారు. విద్యార్థుల ఈ విజయం ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు శ్రీధర్ బాబు, రంజిత్ రెడ్డి, అనిల్ కుమార్ రెడ్డి, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినీలు మరియు విద్యార్థులు పాల్గొని విజేతలకు అభినందనలు తెలిపారు.

## డాక్టర్ సింగం భాస్కర్ కు టీబీసీ జేఏ సి, టాస్కా ల సన్మానం

**సూర్య జగిత్యాల ప్రతినిధి**



అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం దక్కిన జగిత్యాల పట్టణ నేతాజీ కళాశాల అధినేత సింగం భాస్కర్ ను టీ బీసీ జేఏ సి రాష్ట్ర అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో వివిధ సంఘాల ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం జిల్లా కేంద్రం లోని సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ సమావేశ మందిరంలో డాక్టరేట్ పొందిన సింగం బాస్కర్ ను టీ బీసీ జేఏ సీ, సీనియర్ సిటిజెన్స్, పెన్షనర్స్, సంఘాలు సన్మానించాయి. ఈ సందర్భంగా హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ గత 38ఏళ్ళు గా విద్యారంగం లో భాస్కర్ విశిష్ట సేవలు అందించాడని, అనేక మంది నేతాజీ కళాశాలలో చదివిన విద్యార్థులు ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారని కొనియాడారు. ఈ కార్యక్రమం లో టీ బీసీ జేఏ సీ జిల్లా అధ్యక్షులు కొండా లక్ష్మణ్, మహిళా సంఘము అధ్యక్షురా లు గంగము జలజ, సీనియర్ సిటిజెన్స్ నేతలు గౌరిశెట్టి విశ్వనాతం, పి. సి. హన్మంత్ రెడ్డి, అశోక్ రావు, సింగం గంగాధర్, వెళముల ప్రకాష్ రావు, పెన్షనర్స్ నేతలు వీరా రెడ్డి, గంగాధర్, ఉమ్మడి జిల్లా యువజన జేఏ సీ అధ్యక్షులు దొనూరి భూమాచారి, తదితరులు పాల్గొన్నారు.

## అలరించిన ఉగాది కవి సమ్మేళనం

**సూర్య, సెంటినరీ కాలనీ**



పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ఉగాది పండుగను పురస్కరించుకొని ఉగాది కవి సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ట్రినిటీ డిగ్రీ కళాశాల ఆవరణలో ఉదయ సాహితీ, తెలంగాణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పలువురు కవులు తమ కవితలను వినిపించి ఉగాది పండుగ విశిష్టతను చాటారు. ఈ కవి సమ్మేళనంలో మంథని జేఎన్టీయూ కళాశాల సెక్యూరిటీ విభాగంలో విధులు నిర్వహించే కవి బియ్యన తిరుపతి ఉగాది పండుగపై రచించిన కవితను గానం చేసి సభికులను మంత్ర ముగ్ధుల్ని చేశారు. ఆయన కవిత్వానికి సభలోని సాహితీ ప్రేమికులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయ సాహితీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు దాస్యం లక్ష్మయ్య, కవయిత్రి పురీమల సునంద బియ్యన తిరుపతిని అభినందించి జ్ఞాపికను అందించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రచయితల సంఘం అధ్యక్షులు ఏలేశ్వరం వెంకటేశ్వర్లు, అరసం రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల నారాయణ, నూనె రాజేశం తదితర సాహితీ ప్రముఖులు పాల్గొన్నారు. కార్యక్రమం సాహితీ వాతావరణంలో ఉత్సాహంగా కొనసాగింది.

## ఘనంగా ప్రపంచ పిచ్చుకల,అడవి దినోత్సవం

**సూర్య,రాయికల్**




రాయికల్ మండలం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అల్లిపూర్ లో ప్రపంచ పిచ్చుకల,అడవి దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అల్లిపూర్ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శాంబయ్య హాజరై మాట్లాడుతూ పక్షుల సంరక్షణ,అడవుల పరిరక్షణ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరి పాత్ర ఎంతో ముఖ్యమని విద్యార్థులకు సూచించారు. పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు రాజేందర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రకృతి ప్రేమను పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు అవసరమని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు పిచ్చుకల గూళ్ళు తయారు చేయడం,మొక్కలు నాటడం వంటి అవగాహన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీట్ ఆఫీసర్ రమాదేవి,ఫారెస్ట్ సిబ్బంది,ఉపాధ్యాయులు శ్రీనివాస్, రవికుమార్, వసంతరావు,లక్ష్మి,రాజశేఖర్, మహేష్,ఆనంద్, రాజన్న, రతిలాల్,బాలమురళి రజిత, మల్లారెడ్డి,శంకరయ్య,కృష్ణ ప్రసాద్, జీవన్ రెడ్డి లు మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## బాధితులకు బాసటగా... ఆన్ సైట్ ఎఫ్.ఐ.ఆర్ నమోదు

**సూర్య, సెంటినరీ కాలనీ**

పోలీసుల సేవలను ప్రజలకు మరింత చేరువ చేస్తూ ఆన్ సైట్ ఎఫ్.ఐ.ఆర్ కార్యక్రమంలో భాగంగా రామగిరి పోలీసులు కీలక అడుగు వేశారు. బాధితురాలు ఫిర్యాదు చేయడానికి స్టేషన్‌కు వచ్చే అవసరం లేకుండా వారు ఉన్న చోటికే వెళ్లి కేసు నమోదు చేశారు. మండలంలోని నాగేపల్లి గ్రామానికి చెందిన మట్ట రాజయ్య(48) అనే భవన నిర్మాణ మేస్త్రీ రాజాపూర్ గ్రామంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన విషయాన్ని బాధిత కుటుంబ సభ్యులు రామగిరి పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న వెంటనే రామగిరి ఎస్సై తాడవేని శ్రీనివాస్ తన సిబ్బందితో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధితురాలు మృతుడి రాజయ్య భార్య ఓదమ్మ వద్ద నుంచి ఫిర్యాదును స్వీకరించి, అక్కడికక్కడే ఎఫ్.ఐ.ఆర్ నమోదు చేశారు. అనంతరం ఆ ఎఫ్.ఐ.ఆర్ పత్రాన్ని బాధితురాలికి అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై తాడవేని శ్రీనివాస్ మాట్లాడుతూ.. బాధితులకు సత్వర పోలీసుల సేవలు అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. 'ఆన్ సైట్ ఎఫ్.ఐ.ఆర్' కార్యక్రమం ద్వారా బాధితులు పోలీస్ స్టేషన్ కు వెళ్లే అవసరం లేకుండా వారి వద్దకే వచ్చి ఫిర్యాదు స్వీకరించి ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు.




## విద్యారంగానికి కేటాయింపులు నామమాత్రమే

### - తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బేతి సాయికృష్ణ



**సూర్య జగిత్యాల అర్బన్**

తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 వార్షిక బడ్జెట్‌లో విద్యా రంగానికి చేసిన కేటాయింపులు నామమాత్రంగా ఉన్నాయని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బేతి సాయికృష్ణ పేర్కొన్నారు. ప్రభుత్వం మొత్తం బడ్జెట్ వ్యయాన్ని ?3,24,234 కోట్లుగా చూపినప్పటికీ, విద్యారంగానికి కేటాయించిన ?26,674 కోట్లు మొత్తం బడ్జెట్‌లో కేవలం 8.23% మాత్రమేనని వారు స్పష్టం చేశారు. గత ఏడాదితో పోలిస్తే ఈ వాటా కేవలం 0.65% మేర మాత్రమే పెరిగిందని, ఇది విద్యా వ్యవస్థ పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా, ఆకునూరి మురళి నేతృత్వంలోని విద్యా కమిషన్ నివేదికను ప్రస్తావిస్తూ, బడ్జెట్‌లో కనీసం ఐదు శాతం కూడా పాఠశాలల అభి వృద్ధికి నిధులు దొరకటం లేద ని కమిషన్ ఎత్తి చూపిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన 15% నిధులను విద్యాశాఖకు కేటాయించడంలో ప్రభు త్వం విఫలమైందని, ఈ అరకొర నిధులతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ నిర్వహణ అసాధ్యమని వారు పేర్కొన్నారు. తక్షణమే విద్యారంగానికి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు 15 శాతానికి పెంచాలని డిమాండ్ చేసారు.

# సింగరేణి సంస్థలో వారసత్వ ఉద్యోగాలు ఇక ఉండవు

**-హైకోర్టు ఆదేశాలతో నిలిచిపోయిన వారసత్వ ఉద్యోగాలు -గుర్తింపు పొందిన యూనియన్ గొప్పదనానికి చెంపపెట్టు**

**-హెచ్ఎంఎస్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ గోశిక అశోక్**

**సూర్య, సెంటినరీ కాలనీ**

సింగరేణి సంస్థలో వారసత్వ ఉద్యోగాలు ఇక ఉండవని, వారసత్వ ఉద్యోగాలను హైకోర్టు తప్పు పట్టిందని హెచ్ఎంఎస్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ గోశిక అశోక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ తరహాలో ఉద్యోగాలు ఇవ్వాలన్న తెలంగాణ ప్రభుత్వ ప్రకటనలను రద్దు చేస్తున్నట్లు స్పష్టం చేసిందని, కొత్త నోటిఫికేషన్ విడుదల చేసి రిక్రూట్మెంట్ జరపాలని ప్రభుత్వం సింగరేణి సంస్థకు ఆదేశించిందని, కాగా ఉద్యోగాల వారసత్వంగా వారి కుటుంబంలోని వారికి ఉద్యోగాలు ఇవ్వడాన్ని తప్పుపడుతూ కొందరు కోర్టు ను ఆశ్రయించడం తెలిసిందేనన్నారు. దీని ఆధారం గానే ఈ వారసత్వాలు ఉద్యోగాలకు రద్దు విధిం చింది కాగా సింగరేణిలో గుర్తింపు పొందిన యూనియన్ ఇన్ని సంవత్సరాలు కొనసాగుతా ఉంటే ఒకనాడు కూడా దీనిపై స్పందించి యాజమాన్యం తో స్పష్టంగా మాట్లాడి ఆ హక్కును కాపాడలేక పోయిందని ఆరోపిం చారు. పోరాడి సాధించిన డిపెండెంట్ ఉద్యోగ హక్కును గుర్తింపు పొందిన యూని యన్ ఏఐటీయూసీ అలాగే మరో యూనియన్ ప్రభుత్వ ఆధీనంలో కొనసాగుతున్న ఐఎన్టీ యూసీ లు కలిసి ఈ రద్దు ప్రక్రియ వరకు తీసుకురావడం జరిగిందంటూ ఆవేదన వ్యక్తం చేశారు.కార్మిక లోకం ఇప్పటికైనా వీరి యొక్క కుటిల ప్రలోభాలను గమనించాలని సూచించా రు. అలాగే మీ కుటుంబంలో మీ పిల్లలకు ఉద్యోగం ఇప్పించే బాధ్యత మాదని ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న ఐఎన్టీయూసీ యూనియన్ గొంతెత్తి అరుస్తూ ఉంటే అది తెగిన గాలిపటం లా గిల్లి కావడం జరిగిందని, అలాగే గుర్తింపు సంఘం మరో వారం రోజుల్లో సమ్మె చేస్తున్నాం ప్రస్తుతం ధర్నాలు బయటయింపులు చేస్తూ మీకున్న హక్కులను కాపాడుదాం అంటూ అందు లో ప్రధానంగా వారసత్వ ఉద్యోగాల హక్కును ఎట్టి పరిస్థితుల్లో కూడా మేము రద్దు కానివ్వమని, వెంటనే అమలు చేసి గతంలోగా



మీ పిల్లల కు ఉద్యోగాలు ఇప్పించే బాధ్యత మాదంటూ ఏఐటీయూసీ గొంతే త్వరిస్తూ సేవ్ సింగరేణి జాత పేరిట కార్మిక లోకాన్ని తప్పు పట్టిస్తున్న తరుణం ఈ హైకోర్టు తీర్పుతో బయటపడింది అంటూ ఆయన ఎద్దేవా చేశారు.వారసత్వ ఉద్యోగాలను రద్దు చేస్తున్నట్లు ఒకవైపు హైకోర్టు తప్పు పడితే, మరొకవైపు గుర్తింపు యూనియన్ మాత్రం తప్పకుండా మేము సమ్మె చేసి సాధిస్తామంటూ సింగరేణి వ్యాప్తంగా ధర్నాలు చేస్తున్న విషయం తెలిసిందేనన్నారు. ఇది కేవలం కార్మికులను తప్పు పట్టించుకోవడం కోసమా లేక వీరికి తెలిసి ఉండి కూడా వారి మద్దతు పొందడం కోసం చేస్తున్న నాటకం కార్మిక లోకం గమనించాలం టూ హెచ్ఎంఎస్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ గోశిక అశోక్ పిలుపునిచ్చారు.

# వయోధికులకు టాస్క ఆసరా

**- సీనియర్ సిటిజెన్స్ రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్**



**సూర్య జగిత్యాల ప్రతినిధి**

సీనియర్ సిటిజెన్లకు (వయో వృద్ధులు )తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ ఆసరాగా ఉందని, రాష్ట్ర అధ్యక్షులు పి. నర్సింహా రావు ఆధ్వర్యంలో రాష్ట్రములోని అన్ని జిల్లాల్లో పిల్లల నిరాధరణకు గురవుతున్న వృద్ధ తల్లి దండ్రుల సమస్యల పరిష్కారం కు కృషి చేస్తున్నామని టాస్క రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో సీనియర్ సిటిజెన్స్ కౌన్సిలింగ్ కేంద్రంలో వయోధి కుల సంరక్షణ, పోషణ చట్టం పై వివిధ సంఘాల ప్రతినిధులకు టాస్క జిల్లా శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో టాస్క జిల్లా కోశాధికారి వెల్ముల ప్రకాష్ రావు 71వ జన్మదిన వేడుకలు, తమిళ్ కల్చరల్ యూనివ ర్సిటీ వారి గౌరవ డాక్టరేట్ అవార్డు పొందిన జగిత్యాల నేతాజీ వృత్తి విద్యా కళాశాల అధినేత సింగం భాస్కర్ ను ఘనంగా సన్మానించారు. వయోధి కులకు వ్యాధుల నివారణకు ఆరోగ్య శిభిరం నిర్వహించి దినసరి ఆహార ప్రణాళికపై ప్రముఖ న్యూట్రిషియన్ నిపుణులు మీనారావు, హెల్త్ కన్సల్టెంట్ బద్ది పవిత్రలచే అవగాహన కల్పించి, హెల్త్ చెకప్ లు చేయించారు. ఈ కార్యక్రమం లో జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, పెన్షనర్ల జిల్లా ప్రధాన కార్యదర్శి పి. సి. హన్మంత్ రెడ్డి, సహాయ అధ్యక్షులు బొల్లం విజయ్, రాష్ట్ర నేత పూసాల అశోక్ రావు, సీనియర్ సిటిజెన్స్ జిల్లా కోశాధికారి వెల్ముల ప్రకాష్ రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి కొయ్యడ సత్యనారాయణ, ఎం. డి. యాకూబ్,జగిత్యాల పట్టణ కార్యదర్శి సింగం భాస్కర్, ధర్మపురి నియోజకవర్గం అధ్యక్షులు కండ్లె గంగాధర్, బుగ్గారం కార్యదర్శి దుబ్బేష్, బీసీ మహిళా జిల్లా అధ్యక్షురాలు గంగము జలజ, యువజన సంఘా ల జేఏసి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు దొనూరి భూమాచారి, డాక్టర్ సింగం భాస్కర్,కుంటాల కిషన్, నలువాల హన్మాండ్లు,ఆలిశెట్టి నారాయణ, జగదీశ్వర్ రావు, బ్రహ్మయ్య,వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కల్వచర్లలో కొత్త సిమెంట్ రోడ్డును చెడగొట్టకండి

**-అధికారులకు వినతిపత్రం అందజేత**

**సూర్య, సెంటినరీ కాలనీ**



రామగిరి మండలం కలవచర్ల గ్రామంలో ఇటీవల నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్డు ను చెడగొట్ట వద్దని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు రెండ్ల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో నాయకులు మండల అధికారులకు వినతి పత్రం అందచేశారు. గ్రామ ప్రజల దీర్ఘకాలిక రవాణా సమస్యలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో సుమారు రూ. 2.6 కోట్ల వ్యయంతో 18 అడుగుల వెడల్పుతో ఈ సిమెంట్ రోడ్డు నిర్మించబడిందని, అయితే ప్రస్తుతం రహదారి పక్కన నీటి పైప్‌లైన్ పనుల కోసం తవ్వకాలు జరుగుతుండటంతో రోడ్డు దెబ్బతినే ప్రమాదం ఉందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ప్రత్యేకించి వర్షాకాలంలో మరియు భారీ వాహనాల రాకపోకల సమయంలో రహదారి కుంగిపోవడం లేదా కూలి పోవడం వంటి ప్రమాదాలు తలెత్తే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో పైప్‌లైన్ పనులను రహదారి నుండి కొంత దూరంగా మార్చాలని, ఇప్పటికే తవ్విన ప్రాంతాలను సిమెంట్ కంకర తో బలంగా పూడ్చి రోడ్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రోడ్డు మరియు పైప్‌లైన్ రెండింటికీ భవిష్యత్తులో ఎలాంటి నష్టం కలగకుండా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరారు. లేనిపక్షంలో ఈ విషయాన్ని రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఒర్రె సదయ్య, వీరబోయిన రాజమౌళి, కొలిపాక సత్తయ్య, బూడిద రాజేందర్, గొట్టిముక్కల మల్లేష్ గౌడ్, ఆసం రాజు, జంగిలి సదానందం, మేకల మారుతి, మామిడి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## జనగణన కార్యక్రమాన్ని ప్రణాళిక బద్ధంగా నిర్వహించాలి

**సూర్య జగిత్యాల ప్రతినిధి**




జనగణన కార్యక్రమాన్ని ప్రణాళిక బద్ధంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ లు బి. ఎస్.లత, బి. రాజ గౌడ్ తెలిపారు.శు క్రవారం జనగణన 2027 కార్యక్రమం నిర్వహణలో భాగంగా తొలిదశలో నిర్వహించనున్న హౌస్ లిస్టింగ్ , హౌసింగ్ సెన్సెస్ సంబంధించి సంబం ధిత అధికారులకు సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న మూడు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమం నిర్వహించా రు.జిల్లా అదనపు కలెక్టర్ లు మాట్లాడుతూ జనగణన తొలి దశ లో నిర్వహించాల్సిన హౌస్ లిస్టింగ్ కార్యక్రమం పై నిర్వహించిన శిక్షణ కార్యక్ర మంలో చెప్పిన అంశాలు ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గతంలో పలు మార్లు సామాజిక, ఆర్థిక సర్వే నిర్వహించామని, ఇందులో సమాచారం అందించడం ఐచ్ఛికమని, కానీ జనగణన కార్యక్రమంలో ప్రతి ఒక్కరు తప్పనిసరిగా సమాచారం ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. జనగణన కార్యక్రమంలో సమాచారం ఇవ్వడానికి నిరాకరించినా, తప్పుడు సమాచారం అందించిన చట్టం ప్రకారం కేసు నమోదు చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఎన్యుమరేటర్లకు జనగణన సంబంధించి అన్ని అంశాలలో పూర్తి అవగాహన ఉండాలని అన్నారు. జనగణన సంబంధించి అధికారులకు ఇచ్చిన మేటిరియల్ ఒకటి రెండు సార్లు చదవాలని అన్నారు.జనగణన సంబంధించి సాఫ్ట్ వేర్ పని తీరు గమనించాలని, ప్రతి ఒక్క అంశాన్ని అధికారులు క్షుణ్ణంగా పరిశీలిం చాలని కింది స్థాయి సిబ్బందికి వదిలి పెట్టవద్దని అన్నారు. జనగణన కార్యక్రమం దేశ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనలో కీలక పాత్ర పోషిస్తుం దని తెలిపారు. ప్రజల నివాస గృహాల వివరాలు, మౌలిక సదుపాయాల స్థితి, కుటుంబాల వివరాలు తదితర అంశాలను ఈ దశలో నమోదు చేయడం జరుగుతు ందని వివరించారు.ఈ శిక్షణ కార్యక్రమంలోఏవో హకీమ్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

## ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కు ఘనంగా స్వాగతం

**సూర్య సుల్తానాబాద్**

పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరామరావు కు ప్రభుత్వ విప్ గా ఎన్నికైన సందర్భంగా పెద్దపల్లి నియోజకవర్గానికి వస్తున్న విప్ కు మండలంలోని గర్రెపల్లి స్టేజి వద్ద నుండి సుల్తానాబాద్ అంబేద్కర్ విగ్రహం వరకు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించి ఘనంగా స్వాగతం పలికారు. సుల్తానాబాద్ స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద పెద్ద ఎత్తున బాణాసంచా పేల్చారు. జిల్లా గ్రంధాలయ సంస్థ అధ్యక్షుడు అంతటి అన్నయ్య గౌడ్, సుల్తానాబాద్ మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అంతటి పుష్పలత, మాజీ ఎంపీటీసీ పల్ల సురేష్ అపర్ణ లు ఎమ్మెల్యే , ప్రభుత్వ విప్ విజయ రమణారావుకు క్రేన్ సహాయంతో పెద్ద గజమాలతో సన్మానించారు. రాజీవ్ రహదారి ఉండ పెద్ద ఎత్తున కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు బైక్ ర్యాలీలో పాల్గొని సుల్తానాబాద్ నుండి పెద్దపల్లికి బయలుదేరి వెళ్లారు.

## ఆదివరాహస్వామి ఆలయానికి లక్ష రూపాయల విరాళం

**-భక్తి భావంతో ముందుకొచ్చిన దాతలు**

**సూర్య, సెంటినరీ కాలనీ**



కమాన్‌పూర్ మండల కేంద్రంలోని శ్రీ స్వయంభు ఆదివరాహస్వామి ఆలయానికి కరీంనగర్ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామానికి చెందిన గుజ్జ నివేదిత - సుధాకర్ రావు దంపతులు రూ. 1,00,016/- (ఒక లక్ష పదహారు రూపాయలు)లను ఆలయ అభివృద్ధి కోసం విరాళంగా అందజే శారు. శుక్రవారం ఆలయాన్ని దర్శించుకున్న దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తమ విరాళాన్ని కమాన్‌పూర్ గ్రామ సర్పంచ్ రంగు సత్యనా రాయణ గౌడ్‌కు అందజేశారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించడం పట్ల దాతలు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ గుజ్జ నివేదిత - సుధాకర్ రావు దంపతుల సేవాభావం అభినందనీయమని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధి సామూహిక బాధ్యతగా ప్రతి భక్తుడు భావించాలని సూచించారు. ఇలాంటి దాతల సహకారంతోనే ఆలయాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తా మన్నారు. అలాగే భవిష్యత్తులో కూడా భక్తులు ముందుకు వచ్చి తమ వంతు సహాయ సహకారాలు అందించాలని, ఆలయానికి అవసరమైన సదుపాయాల విస్తరణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కోరుట్లలో బీజేపీ పట్టణ అధ్యక్షుడిగా కస్తూరి లక్ష్మీ నారాయణ నియామకం

**సూర్య కోరుట్ల**



భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కోరుట్ల పట్టణ అధ్యక్షుడిగా 11వ వార్డ్ కౌన్సిలర్ కస్తూరి లక్ష్మీ నారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు కోరుట్ల పట్టణంలోని నియోజకవర్గ నాయకుడు డా. అనూప్ రావు నివాసంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు, డా. అనూప్ రావు, రాష్ట్ర ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు రుద్ర శ్రీనివాస్ కలిసి లక్ష్మీ నారాయణకు నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా నాయ కులు మాట్లా డుతూ కోరుట్ల పట్టణంలో ప్రజా సమస్యలపై బీజేపీ బలమైన పోరాటం చేయాలని, మున్సిపల్‌లో పార్టీ స్వరం గట్టిగా వినిపించేలా కృషి చేయాలని సూచించారు.నూతన అధ్యక్షుడు కస్తూరి లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన ఇందూరు పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అరవింద్, జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు, డా. అనూప్ రావు, రుద్ర శ్రీనివాస్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలోని ప్రతి ప్రజా సమస్యపై నిరంతరం పోరాడుతూ, అన్ని కార్యకర్తలను కలుపుకుని ముందుకు సాగుతానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో 27వ వార్డ్ కౌన్సిలర్ తిరుమల వాసు, మెట్పల్లి పట్టణ 26వ వార్డ్ కౌన్సిలర్ బొడ్ల రమేష్, పార్లమెంట్ కో-కన్వీనర్ గుంటుక సదాశివ్, పట్టణ ప్రధాన కార్యదర్శులు చెట్లపెల్లి సాగర్, ఎర్ర రాజేందర్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధోనికెల నవీన్, సంకట విజయ్, రాగంశెట్టి సాయి కృష్ణ, తులసి కృష్ణ, బేక్కం అశోక్, రాధారాపు సత్యనారాయణ, ప్రేమ్ సాగర్, రాహుల్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలి

## - ఈ నెల 24న కలెక్టరేట్ ఎదుట ధర్నా - సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి



**సూర్య, జమ్మికుంట**

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక చట్టాలు తెచ్చి దేశ సంపదను కార్పొరేట్లకు, బహుళ జాతి సంస్థలకు అప్పగించే ప్రయత్నం చేస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి ఆరోపించారు. శుక్రవారం రోజున జమ్మికుంట పార్టీ కార్యాలయంలో మండల కమిటీ సమావేశం కామ్రేడ్ డి సతీష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విత్తన, విద్యుత్ చట్టాలు తెచ్చిందని, బహుళ జాతి సంస్థల ఉపయోగపడే విధంగా చట్టం రూపొందించారన్నారు. రైతాంగాన్ని భూమి నుండి వేరు చేసే కుయుక్తులు పన్నుతుందన్నారు. స్వాతంత్రానికి పూర్వం కార్మిక వర్గం పోరాడి సాధించిన 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చిందని ఇది కార్మిక వర్గాన్ని మరింత కట్టు బానిసలుగా చేసే చట్టాలే అన్నారు. మహత్మ గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని రద్దుచేసి విబిజి రాంజీ చట్టాన్ని తెచ్చారని ఇది ముమ్మాటికి వ్యవసాయ కూలీల కడుపు కొట్టి చట్టమన్నారు. యధావిధిగా పాత చట్టాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తూ దేశభక్తి పేరుతో కులాల మధ్య, మతాల మధ్య చిచ్చు పెడుతూ రాజకీయ పబ్బం గడుపుకుంటుందన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు అనేక హామీలు ఇచ్చిందని హామీలు కొన్ని నెరవేర్చినప్పటికీ మిగతావి నెరవేర్చడంలో పూర్తిగా వైఫల్యం చెందారన్నారు. మహిళలకు నెలకు 2,500, నిరుద్యోగ భృతి, అన్ని పంటలకు బోనస్ బోగస్కానే ఉందన్నారు. కష్టజీవులు,కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఈనెల 24న జిల్లా కలెక్టరేట్ ముందు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎక్కడికి అక్కడ స్థానిక సమస్యలపై ఆందోళన పోరాటాలు నిర్వహించాలన్నారు. భగత్ సింగ్ వర్ధంతిని పురస్కరించుకొని ప్రతి పార్టీ శాఖ ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాలు, సెమినార్లు, నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు కొప్పుల శంకర్, మండల కమిటీ సభ్యులు దండిగారి సతీష్, బాసిర సంపత్ రావు, వడ్లూరి కిషోర్, బైరం సమ్మయ్య, రాచపల్లి తిరుపతి, గడ్డం శోభన్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు

## - మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన వాల బాలకిషన్ రావు

**సూర్య, వీణవంక**

పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని వీణవంక మండల కేంద్రంలోని చల్లూరు గ్రామంలో మత సామరస్యం వెల్లివిరిసింది. మాజీ మార్కెట్ చైర్మన్ వాల బాలకిషన్ రావు ఆధ్వర్యంలో స్థానిక ముస్లిం మత పెద్దలకు, సోదరులకు ఘనంగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ మసీదుల ఇమామ్‌లు, మత పెద్దలు, ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో హాజర య్యారు. ఈ సందర్భంగా బాల కిషన్ రావు స్వయంగా వారికి వడ్డించి, రంజాన్ శుభాకాంక్షలు తెలియజే శారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా అందరూ కలిసి మెలిసి ఉండాలనే సంకల్పంతో ఈ విందును ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థ నలు నిర్వహించి, దేశం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. తమను గౌరవించి, ఇంతటి ఘనమైన విందును ఏర్పాటు చేసినందుకు ముస్లిం సోదరులు బాల కిషన్ రావుకి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, ప్రముఖులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





## వల్భాపూర్‌లో రైతులకు అవగాహన సదస్సు

### - వరి, మొక్కజొన్న సాగుపై శాస్త్రవేత్తల సూచనలు

**సూర్య, వీణవంక**

వీణవంక మండలంలోని వల్భాపూర్ గ్రామ రైతు వేదికలో శుక్రవారం ఏటిఎంఏ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొని సాగులో మెళకువలను వివరించారు. కెవికె శాస్త్రవేత్త శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో వరి పంటను ఆశించే కాండం తొలిచే పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పొలంలో జింక్ లోపం ఏర్పడకుండా చూసుకోవాలని, నేల సారాన్ని పెంచేందుకు పచ్చిరొట్ట ఎరువుల ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. అలాగే మొక్కజొన్నను వేధిస్తున్న కత్తెర పురుగు నివారణకు పాటించాల్సిన సమగ్ర యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఇఫ్కో మేనేజర్ బాలాజీ మాట్లాడుతూ... సాంప్రదాయ ఎరువులకు ప్రత్యామ్నాయంగా వచ్చిన నానో యూరియా, నానో డిఏపి వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వీటిని ఏయే దశల్లో, ఎంత పరిమాణంలో వాడాలో రైతులకు ప్రాక్టికల్‌గా వివరించారు. ఈ కార్యక్రమంలో వల్భాపూర్ సర్పంచ్ అందె శ్రీమతి, ఉప సర్పంచ్ నమని విజేందర్, మార్కెట్ డైరెక్టర్ శ్రీపతి రెడ్డి, మండల వ్యవసాయ అధికారి గణేష్, ఏఈవో సంగీతతో పాటు వల్భాపూర్, బేతిగల్, కనపర్తి గ్రామాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ కు విప్ రావడం పట్ల సంబరాలు

**సూర్య, ఇల్లందకుంట**




తెలంగాణ పిసిసి ఉపాధ్యక్షులు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ కు విప్ రావడం పట్ల కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లా ఫిషర్ మెన్ చైర్మన్ బండి మల్లేష్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు గడ్డివానిపల్లి సర్పంచ్ గడ్డి శ్రీనివాస్, వంగ రామకృష్ణలు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో పని చేసే ప్రతి కార్యకర్తను కాంగ్రెస్ పార్టీ గుర్తించి ఉన్నతమైన పదవులు కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేని కష్టకాలంలో హుజురాబాద్ నియోజకవర్గ ఇన్చార్జిగా ప్రతి కార్యకర్తకు అండగా ఉంటూ అనేక పోరాటాలు చేశారని గుర్తు చేశారు. రానున్న రోజుల్లో ఇంకా ఉన్నతమైన పదవులు బల్మూరి వెంకట్‌కు రాష్ట్ర ప్రభుత్వం కల్పించాలని కోరారు. మండలంలో ఉన్నటువంటి సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను హుజురాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బండి మల్లేష్ ఫిషర్మెంట్ చైర్మన్ కరీంనగర్ జిల్లా వంగ రామకృష్ణ, మండల సీనియర్ నాయకులు సర్పంచ్ గడ్డి శ్రీనివాస్, ఉప సర్పంచ్ అరెల్లి రమేష్, గుండారపు సాయికుమార్, యూత్ కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి మంకు ఐలయ్య, ధంసాని కిరణ్, పెద్ది అభి, జక్కు కుమార్, పరకాల విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## కాట్రపల్లి గ్రామ దేవాలయ కమిటి ఏర్పాటు

**సూర్య, హుజురాబాద్ రూరల్**



హుజురాబాద్ మండలం కాట్రపల్లి శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయ నూతన కమిటి శుక్రవారం ఏర్పాటు అయింది. గౌరవ అధ్యక్షులుగా గ్రామ సర్పంచ్ పెరుమాండ్ల హైమ, దేవాలయ కమిటి చైర్మన్‌గా చిలుకమారి శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా ముత్తోజు సాంబశివా చారి, కోశాధికారి బాణాల కుమార్, సభ్యులుగా వంగ రాములు, సంగాల రాజు, రావుల రాజేష్, తొగరు శివకృష్ణ, అల్లి జగదీష్, తాడూరి శ్రీనివాస్, ఎదులపురం రాజు, తొగరు మోహన్, నిమ్మల కుమారస్వామి, వేల్పుల అశోక్, బాణాల పెద్దులు, అల్లి సత్య రాజం, అర్చకులు ప్రవీణ్ శర్మ లు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో గంగదారి బిక్షపతి, ఉప సర్పంచ్ నిమ్మల రాజ్ కుమార్, నిమ్మల కుమారస్వామి, వార్డ్ మెంబర్ కొమటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న ఆలయ చైర్మన్ ఇంగిలే రామారావు

### - ఆలయంలో పనిచేస్తున్న మహిళా సిబ్బందికి చీరల పంపిణీ

**సూర్య, ఇల్లందకుంట**



అపర భద్రాద్రిగా పేరుపొందిన ఇల్లందకుంట శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న మహిళా సిబ్బందికి మానవత దృక్పథంతో చీరలను పంపిణీ చేశారు. శుక్రవారం ఆలయంలో పనిచేస్తున్న ఐదు మంది మహిళా సిబ్బందికి రామారావు తన సొంత డబ్బులతో ఖరీదు చేసిన చీరలను వారికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రీరామనవమి పండుగను పురస్కరించుకొని ఆలయంలో పనిచేస్తున్న మహిళా సిబ్బందికి చీరలు అందించాలని ఒక చిన్న సదుద్దేశంతో వారికి శ్రీరామనవమి కానుకగా అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు గోడిశాల పరమేష్, నారాయణ రెడ్డి దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

## సీసీ కెమెరాల ఏర్పాటుతో భద్రత మరింత పటిష్టం

### - గంగాధర ఎస్సై వంశీకృష్ణ

**సూర్య, గంగాధర**



గ్రామాలలో సిసి కెమెరాలతో భద్రత మరింత పటిష్టంగా ఉంటుందని గంగాధర ఎస్సై వంశీకృష్ణ అన్నారు. గంగాధర మండలం కాచిరెడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం భద్రతను పెంచిడానికి సీసీ కెమెరాలను శుక్రవారం ఎస్సై వంశీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామంలో సీసీ కెమెరాల వ్యవస్థ ఏర్పాటు ద్వారా నేరాలను నియంత్రించడం, అనుమానాస్పద కదలికలను గుర్తించడం సులభమవుతుందన్నారు. ప్రజల భద్రతను కాపాడడంలో సీసీ కెమెరాలు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. బచ్చు దయాకర్ సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో ఏదైనా నేర సంఘటనలు జరిగినప్పుడు దర్యాప్తుకు ఇవి ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని వివరించారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరిస్తూ గ్రామ భద్రతను కాపాడేందుకు ముందుకు రావాలని సూచించారు. సీసీ కెమెరాల నిర్వహణను సక్రమంగా కొనసాగిస్తూ, వాటి ద్వారా గ్రామంలో శాంతి భద్రతలు మెరుగుపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోల మమత శ్రీనివాస్, ఉపసర్పంచ్, యువకులు, ప్రజలు పాల్గొన్నారు.

## దేవాదాయ శాఖను విస్మరించిన బడ్జెట్

### - జనసేన పార్టీ పార్లమెంట్ కో-ఆర్డినేటర్ బేతి మహేందర్ రెడ్డి

**సూర్య, కరీంనగర్**



రాష్ట్ర బడ్జెట్‌లో దేవాదాయ శాఖకు నిధులు కేటాయించకపోవడంపై జనసేన పార్టీ పార్లమెంట్ కో-ఆర్డినేటర్ బేతి మహేందర్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. హిందూ దేవాలయాల ఆదాయాన్ని ఇతర శాఖలకు మళ్లించడం కాంగ్రెస్ ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమన్నారు. మైనారిటీ సంక్షేమానికి భారీ నిధులు కేటాయించిన ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధిని విస్మరించిందని ఆక్షేపించారు. రాష్ట్రంలోని అనేక దేవాలయాలు నిధుల కొరతతో ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు. ఈ విషయంపై ప్రజలు ఆలోచించాలని, దేవాదాయ శాఖకు ప్రత్యేక నిధులు కేటాయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# అన్ని వర్గాలను పూర్తిగా విస్మరించిన ప్రభుత్వం

## - బిఆర్ఎస్ ఇచ్చిన ఉద్యోగాలకు నియామక పత్రాలు జారీ చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

## - రాష్ట్ర బడ్జెట్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎల్. రమణ విమర్శలు

**సూర్య జగిత్యాల**

"తెలంగాణ ప్రభుత్వం" ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర ప్రజలను తీవ్ర నిరాశకు గురిచేసిందనీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు నిరుద్యోగులు, మహిళలు, వృద్ధుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించినట్లు ఎమ్మెల్సీ ఎల్.రమణ విమర్శించారు. బీసీలకు ఇచ్చిన హామీలకు చట్టబద్ధత కల్పిస్తామని చెప్పిన ప్రభుత్వం మాట నిలబెట్టుకోలేదు. ముదిరాజులు, మున్నూరు కాపులు, గొల్ల కుర్మలు, చేనేత మరియు గీత కార్మికులతో పాటు ఇతర బీసీ కులాలకు మొండిచేయి చూపింది" అని ఆయన విమర్శించారు.ఎన్నికల ముందు ప్రకటించిన 'ఆరు గ్యారెంటీలు' బడ్జెట్‌లో ఎక్కడా కనిపించకపోవడం గమనార్హమని, వాటికి తగిన నిధుల కేటాయింపులు చేయకపోవడం ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. గత బడ్జెట్‌లో రూ. 56 వేల కోట్లు కేటాయించి, ఈసారి దానిని రూ. 50 వేల కోట్లకు తగ్గించడం దారుణమని పేర్కొన్నారు. వంద రోజుల్లో అమలు చేస్తామని ఇచ్చిన హామీలు ఎందుకు నెరవేర్చలేదో ప్రభుత్వం వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో కేసీఆర్ సంప



ద సృష్టించి పేదలకు పంచుతూ సంక్షేమ స్వర్ణ యుగాన్ని తీసుకువచ్చారని గుర్తు చేశారు. అయితే ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీఆర్ఎస్ హయాంలో ఇచ్చిన ఉద్యోగ నోటిఫికేషన్లకే నియామక పత్రాలు అందిస్తూ తామే 60 వేల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పుకోవడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని విమర్శించారు. పెన్షన్ల పెంపు కోసం ఎదురుచూస్తున్న ప్రజలను కూడా ప్రభుత్వం నిరాశపరుస్తోందని అన్నారు.చేనేత రంగంపై కూడా ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చూపుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన "నేతన్న బీమా", "నేతన్నకు చేయూత", "చేనేత మిత్ర", "నేతన్నలకు భరోసా" వంటి పథకాలు చేనేత కార్మికుల జీవన ప్రమాణాలను గణనీయంగా మెరుగుపరిచాయని తెలిపారు.

చేనేత కార్మికులకు రూ. 1 లక్ష వరకు రుణమాఫీ చేయడంతో పాటు పావలా వడ్డీకే రుణాలు అందించిన విషయం గుర్తు చేశారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం చేనేత రుణమాఫీ పేరుతో అరకొర నిధులు విడుదల చేసి, మున్సిపాలిటీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కేవలం పట్టణ ప్రాంత చేనేత కార్మికులకు మాత్రమే లబ్ధి చేకూర్చి, గ్రామీణ నేతన్నలను విస్మరించిందని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా రుణమాఫీ కోసం ఇంకా రూ. 16 కోట్ల విడుదలకు ఉత్తర్వులు ఉన్నప్పటికీ, నేటి వరకు నిధులు విడుదల కాలేదని తెలిపారు.అదేవిధంగా "నేతన్నలకు భరోసా" పథకం కింద జియో ట్యాగ్ చేసిన మగ్గాలపై పనిచేసే కార్మికులకు ఏటా 18,000, అనుబంధ కార్మికులకు 6,000 ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చి రెండు సంవత్సరాలు గడిచిపోయినా, ఇప్పటికీ అమలు జరగకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు.పేద వర్గాలకు, చేనేత కార్మికులకు, బీసీలకు న్యాయం చేయకుండా మోసం చేసిన ఈ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పే సమయం ఆసన్నమైందని ఎల్.రమణ హెచ్చరించారు.

# హెచ్.పి.వి వ్యాక్సిన్ పట్ల అవగాహన కల్పించాలి

## - డాక్టర్ వెంకట రమణ

**సూర్య, హుజురాబాద్**

14 సంవత్సరాలు నిండిన బాలికల్లో గర్భాశయ క్యాన్సర్ రాకుండా ఉండేందుకు రూపొందించిన హెచ్.పి.వి వ్యాక్సిన్ పట్ల ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, డాక్టర్ వెంకట రమణ అన్నారు. శుక్రవారం హుజురాబాద్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో నిర్వహిస్తున్న హెచ్.పి.వి వ్యాక్సిన్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఇప్పటి వరకు ఎంత మంది వ్యాక్సిన్ వేసుకున్నారు, ఇంకా ఎంత మంది వ్యాక్సిన్ వేసుకోవాల్సి ఉంది అన్న విషయాన్ని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందిని అడిగి తెలుసుకొని రిజిస్టర్ లను పరిశీలించారు. 14 సంవత్సరములు నిండిన బాలికలను వ్యాక్సిన్ సెంటర్‌కి తరలించి హెచ్.పి.వి టీకా తీసుకునేటట్లు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. స్కూళ్లలో 14 సంవత్సరాల నిండిన బాలికలను హెచ్.పి.వి వ్యాక్సిన్ వేసుకునేటట్లు మోటివేట్ చేయాలని, వారిలో ఉన్న అపోహలను తొలగించాలని అన్నారు.

**- చెల్పూర్ పి.హెచ్.సి తనిఖీ...**



హుజురాబాద్ మండలం చెల్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని వ్యాక్సిన్ కోల్డ్చైన్ స్టేటస్, లేబర్ రూమ్, మందుల స్టోర్ రూమ్ లను సందర్శించారు. నార్మల్ డెలివరీ లను ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిపేటట్లు సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పి.హెచ్.సి వైద్యాధికారి డాక్టర్ తులసీదాస్, సిహెచ్ఓ సదానందం, డిస్టిక్ హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్ గౌడ్, హెచ్ఈఓ విజయేందర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## రేపు డంపింగ్ యార్డ్‌ను వ్యతిరేకిస్తూ అఖిలపక్ష సమావేశం

**సూర్య, హుజురాబాద్**

ఈ నెల 22వ తేది ఆదివారం హుజురాబాద్ వివిల్ఆర్ ఫంక్షన్ హాల్ లో డంపింగ్ యార్డ్ ఏర్పాట్లు నిరసిస్తూ అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు డంపింగ్ యార్డ్ వ్యతిరేక అఖిలపక్ష కమిటి ప్రకటించింది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ హుజురాబాద్ కు సమీపంలోని సిర్సపల్లి గ్రామ పరిధిలో ఏర్పాటు కానున్న డంపింగ్ యార్డ్ వల్ల ఏర్పడనున్న విషపూరితమైన కాలుష్యం వల్ల సిర్సపల్లి గ్రామం, హుజురాబాద్ పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల ప్రజల జీవించే హక్కు కు ప్రమాదమేర్పడుతుందని అన్నారు. పశు,పక్షులకు మనుగడ లేకుండా పోతుందని, వ్యవసాయ ఉత్పత్తులు విషపూరితం కానున్నాయని అన్నారు. రాబోయే కాలంలో వచ్చే ప్రమాదకర పరిస్థితిని మనందరం సంఘటితంగా అడ్డుకోకపోతే డంపింగ్ యార్డ్ ను ఏర్పాటు చేస్తారని అన్నారు. రాజకీయాలకతీతంగా ఏర్పాటు చేసే రౌండ్ టేబుల్ సమావేశానికి హుజురాబాద్ ప్రాంత అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాలు, కుల సంఘాలు, వృత్తి సంఘాలు, వ్యాపార, వాణిజ్య సంఘాలు, అన్ని ఉపాధ్యాయ, ఉద్యోగ, కార్మిక, విద్యార్థి సంఘాల బాధ్యులు హాజరుకావాలని కోరారు.

## బడ్జెట్లో బీసీలకు అన్యాయం..

**- బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిదొగ్గలి శ్రీధర్**

**సూర్య కరీంనగర్**



రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్లో బీసీలకు అన్యాయం చేసిందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొగ్గలి శ్రీధర్ ఆవేదన వ్యక్తం చేశారు.. మూడు లక్షల 24 వేల కోట్ల బడ్జెట్ ను కేటాయించిన దానిలో బీసీలకు కేవలం 12 వేల కోట్లు మాత్రమే బడ్జెట్ కేటాయించిందని జనాభా దామాషా ప్రకారం 50% పైగా ఉన్న బీసీలకు రెండు శాతం నిధులు కూడా కేటాయించలేదు.ఫీజుల బకాయిలు గత మూడు సంవత్సరాల నుండి పెండింగ్లో ఉన్న బీసీ విద్యార్థులకు నిధులు కేటాయించక పోవడం, అలాగే బీసీ సంక్షేమ వసతిగృహాలకు ఆహార బిల్లులు గత పది నెలల నుండి ఇవ్వడం లేదు అలాగే ప్రైవేట్ భవనాలలో నిర్వహిస్తున్న వసతి గృహాల అద్దెలు గత మూడు సంవత్సరాల నుండి చెల్లించడం లేదు భవన యజమానులు అద్దె చెల్లించకుంటే బిల్డింగులను ఖాళీ చేయమంటున్నారు ఇలా బీసీ సంక్షేమానికి ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడం శోచనీయకరం.. బీసీ కార్పొరేషన్ పునరుద్ధరణ కార్యక్రమాన్ని ఈ బడ్జెట్‌లో ప్రకటించక పోవడం బీసీలను మోసగించడమేనని వారు తెలిపారు.

## ప్రజలను మభ్యపెట్టే బడ్జెట్

## సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి

**సూర్య కరీంనగర్**



2026-27 సంవత్సరానికి గాను తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ను శుక్రవారం ఆర్థిక మంత్రి బట్టి విక్రమార్క అసెంబ్లీలో ప్రతిపాదించిన 3,24,234 కోట్ల బడ్జెట్ రాష్ట్ర ప్రజలను మభ్యపెట్టే విధంగా ఉంది. అంకెల గారడీ తప్ప ఒరిగేది ఏమీ లేదు. జిల్లా కేంద్రంలో దశాబ్దాల కాలంగా ఎదురుచూస్తున్న డంప్ కార్డు సమస్య ఊసే లేదన్నారు. పెండింగ్ రైల్వే లైన్లకు అలకేషన్స్ లేవు.ఉత్పాదకరంగాలకు బడ్జెట్లో తగినంత నిధులు కేటాయించలేదు. ఇరిగేషన్ శాఖకు కేవలం 22, 615కోట్లు మాత్రమే కేటాయించారు.పెండింగ్ పనులు ఎలా పూర్తి చేస్తారో చూడాలి. ఎన్నికలకు ముందు 400కు పైగా హామీలు ఇచ్చారని హామీల అమలుకు బడ్జెట్లో కేటాయింపులు లేవు.వాస్తవ పరిస్థితులకు పూర్తి విరుద్ధంగా ఉన్న బడ్జెట్ ఆర్థికమంత్రి ప్రసంగంలో భారీ హామీలు గొప్ప పదజాలం తప్ప ఏమీ లేదన్నారు.

## ఘనంగా ఎంపి ఈటల జన్మదిన వేడుకలు


**సూర్య, వీణవంక**



మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ జన్మదిన వేడుకలు శామీర్ పేట్‌లోని ఆయన నివాసంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈటల రాజేందర్‌ను కలిసిన వారిలో మోటం విష్ణు, వెంకటేష్ రాయిశెట్టి, కుమార్, దాసరపు రాజు, అశోక్ తదితరులు ఉన్నారు. వారు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, నిండు నూరేళ్లు ఆరోగ్యంగా వర్ధిల్లాలని ఆకాంక్షించారు. తన జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలపడానికి వచ్చిన ప్రతి ఒక్కరికి ఈటల రాజేందర్ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

## చల్లూరులో కోతుల బెడదకు చెక్

**సూర్య, వీణవంక**



వీణవంక మండలం చల్లూరు గ్రామంలో గత కొంతకాలంగా ప్రజలను ఇబ్బంది పెడుతున్న కోతుల సమస్య పరిష్కారానికి ముమ్మర ప్రయత్నాలు జరుగుతున్నాయి. మాజీ మార్కెట్ చైర్మన్ వాల బాలకిషన్ రావు, భాగ్యలక్ష్మి హోమ్ నీడ్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ ప్రొప్రైటర్ కొమ్ము శ్యామ్ కుమార్ ప్రత్యేక చొరవతో గ్రామంలో కోతులను పట్టే కార్యక్రమాన్ని చేపట్టారు. పట్టుబడిన కోతులను సురక్షితంగా ఒడెడు - ముత్తారం అడవి ప్రాంతానికి తరలిస్తున్నారు. గ్రామస్థులు తమ తమ కాలనీల్లో ఎక్కడైనా కోతులు గుంపులుగా ఉన్నట్లు గమనిస్తే వెంటనే సమాచారం అందించాలని కోరుతున్నారు. కోతుల బెడద నుండి గ్రామాన్ని విముక్తం చేసేందుకు ప్రజలందరూ సహకరించాలని నిర్వాహకులు కోరారు. సమాచారం కోసం కొమ్ము శ్యామ్ కుమార్ 9700728967 నెంబర్‌కు సంప్రదించాలని అన్నారు.

## ముస్తాబాద్‌లో ఫోన్‌పే మోసం బహిర్గతం

**సూర్య, ముస్తాబాద్**

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో ఫోన్‌పే మోసం వెలుగులోకి వచ్చింది. స్థానిక బాలాజీ మెడికల్ షాపులో ఓ వ్యక్తి 400 విలు వైన మందులు కొనుగోలు చేసి, ఫోన్‌పే ద్వారా చెల్లింపు చేసినట్లు చూపించాడు. అయితే, షాప్ యజమానికి అమౌంట్ ఖాతాలో జమ కాకపోవడంతో అనుమానం కలిగింది.దీంతో వెంటనే అప్రమత్తమైన వ్యాపారి పోలీసులకు సమాచారం అందించాడు. సమాచారం అందుకున్న పోలీసులు తక్షణమే ఘటనాస్థలానికి చేరుకుని, ఫోన్‌పే చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.అనంతరం అతన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు.

## ముస్లింలకు బిఆర్ఎస్ ఇఫ్తార్ విందు

**సూర్య గంభీరావుపేట**



గంభీరావుపేట మండల కేంద్రంలోని మస్జిద్ లో శుక్రవారం సాయంత్రం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు బిఆర్ఎస్ నేతలు ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.రంజాన్ మసాన్ని పురస్కరించుకొని ఉపవాస దీక్షలు వున్నా ముస్లింలకు బిఆర్ఎస్ మండల నేతలు స్థానిక మస్జిద్‌లో ఇఫ్తార్ విందు అందించారు. ఈ కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ గౌరినేని నారాయణరావు, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట స్వామి గౌడ్, పట్టణ అధ్యక్షుడు వెంకట యాదవ్ ఉప సర్పంచ్ కమలాకర్ రెడ్డి నాయకులు లింగం యాదవ్,రెడ్డి మల్ల రాజనర్సు, నాగరాజు గౌడ్ వహిద్ శేఖర్ గౌడ్‌లు పాల్గొన్నారు.

## నిరంతరం విధుల్లో ఉండే పోలీస్ సిబ్బందికి

# శారీరక విశ్రాంతి ఎంతో అవసరం

**- పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం**

**- కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో విశ్రాంతి గదిని ప్రారంభించిన సీపీ**

**సూర్య కరీంనగర్**

పోలీస్ సిబ్బంది సంక్షేమం, పనితీరును మెరుగుపరిచే లక్ష్యంతో, కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం శుక్రవారం కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో నూతనంగా నిర్మించిన విశ్రాంతి గదిని ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నిరంతరం విధుల్లో ఉండే పోలీస్ సిబ్బందికి మానసిక ప్రశాంతత, శారీరక విశ్రాంతి ఎంతో అవసరమని పేర్కొన్నారు. సిబ్బంది ఆరోగ్యం, సౌకర్యాల విషయంలో రాజీ పడబోమని, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా వారి పనితీరు మరింత మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అన్ని పోలీస్ స్టేషన్లలో మౌలిక సదుపాయాలను ఆధునీకరించి, సిబ్బందికి మెరుగైన పని వాతావరణాన్ని కల్పించడానికి విభాగం కట్టుబడి ఉందని సీపీ తెలిపారు. తగిన విశ్రాంతి పొందిన అధికారులు అత్యవసర సమయాల్లో, ప్రజలకు సేవ చేయడంలో మరింత చురుగ్గా, సమర్థవంతంగా పనిచేస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్య





క్రమంలో ట్రైనీ ఐపీఎస్ సోహం సునీల్, రూరల్ ఏసీపీ విజయకుమార్, ట్రాఫిక్ ఏసీపీ వెంకటస్వామి, రూరల్ ఇన్స్పెక్టర్ నిరంజన్ రెడ్డితో పాటు ఎస్సైలు నరేష్, లక్ష్మా రెడ్డిలతో పాటు ఇతర పోలీసు అధికారులు, పోలీసు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ చైర్మన్‌గా "అల్ఫోర్స్" నరేందర్ రెడ్డి

**- నూతన కార్యవర్గం ఏర్పాటు**

**సూర్య కరీంనగర్**

సైక్లింగ్ క్రీడకు ప్రత్యేకత ఉన్నదని, ఈ క్రీడకు విస్తృత ప్రచారం చాలా అవసరమని చైర్మన్ కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక కరీంనగర్ లోని వావిలాల పల్లి లో నిర్వహించిన నూతన కార్యవర్గ ఎన్నికల ప్రక్రియలో పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వ్యాప్తంగా కరీంనగర్ జిల్లా సైకిల్ అసోసియేషన్‌కి ప్రత్యేకత ఉన్నదని, ఎన్నో టోర్నమెంట్ల ను నిర్వహించి క్రీడ స్ఫూర్తిని పెంపొందించిందని వారు చెప్పారు. ఈ సందర్భంగా అధ్యక్షునిగా ఎన్నికైన మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ సైక్లింగ్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో అనేక చైతన్యవంతమైన కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని ప్రధానంగా నిర్వహించి క్రీడా స్ఫూర్తిని పరిరక్షించామని వారు చెప్పారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గం మాట్లాడుతూ 2022 నుండి 26 వరకు కరీంనగర్ జిల్లా సంఘం వారి ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలను ముఖ్యంగా అవగాహన కల్పించే కార్యక్రమాలకు దీటుగా వివిధ స్థాయిలలో పాల్గొనే విధంగా అనేక కార్యక్రమాలను చాలా ఆదర్శంగా చేపడుతామని, నేటికీ అదే స్ఫూర్తితో పలు కార్యక్రమాలను వివిధ ప్రాంతాలను ఘనంగా నిర్వహిస్తామని వారు చెప్పారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వ హించినటువంటి ఎన్నికలలో నూతన కార్యవర్గం అంతయు ఏకగ్రీవంగా ఎన్నికవ్వడం చాలా హర్షించదగ్గ విషయమని చెప్పారు. ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించిన ఎన్నికలకు పరిశీలకు లుగా రాష్ట్రం నుండి ఏ.కిషన్, జిల్లా యువజన క్రీడ విభాగం నుండి పవన్, ఒలంపిక్ అసోసి యేషన్ ప్రతినిధి జనార్ధన్ రెడ్డి, రిటర్నింగ్ ఆఫీ సర్‌గా, మాజీ కార్పొరేటర్ ఒలింపిక్ అసోసియే షన్ ప్రతినిధి టి.రమేష్ రెడ్డి వ్యవహరించారని తెలిపారు.



నూతన అధ్యక్షునిగా డాక్టర్ కెప్టెన్ బి మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సురభి వేణుగోపాల్, కోశాధికారిగా విజగదీశ్వర చారి, ఉపాధ్యక్షులుగా ఎం అరవింద్, ఎస్ రాజయ్య, ఎస్ అనుదీప్, సంయుక్త కార్యదర్శిగా ఎస్.ఇంద్రవేశ్ వీ రమేష్ జై నరేష్ తదితరులు సభ్యులుగా ఎన్నుకోబడ్డారని వారు చెప్పారు. ఈ సంఘానికి డాక్టర్ బంగారు స్వామి, ఎస్.కోదండరాములు ప్యాట్రన్స్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతన కార్యవర్గాన్ని ఘనంగా సత్కరించారు. క్రీడా స్ఫూర్తిని పెంపొందిస్తామని, క్రీడల పట్ల చక్కటి వైఖరిని ప్రదర్శిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

## భారత సైన్యంలో నియామకానికి ఆన్‌లైన్ నమోదు దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం

**సూర్య కరీంనగర్**

భారత సైన్యంలో వివిధ కేటగిరీల్లో నియామకానికి సంబంధించి అభ్యర్థులు తమ దరఖాస్తులను సమర్పించడానికి ఆన్‌లైన్ నమోదు, దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. అగ్నివీర్ కేటగిరీల్లో అవివాహిత యువత కోసం నియామక నోటిఫికేషన్ 13 ఫిబ్రవరి 2026న www.joinindi-anarmy.nic.in వెబ్‌సైట్‌లో విడుదలైంది. సికింద్రాబాద్ ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీస్ పరిధిలోని తెలంగాణ రాష్ట్రంలోని 33 జిల్లాల నివాసితుల నుండి దరఖాస్తులు ఆహ్వానించబడుతున్నాయి. నియామకం కోసం అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ క్లర్క్/స్టోర్ కీపర్ టెక్నికల్, అగ్నివీర్ ట్రేడ్స్‌మన్ (10వ తరగతి), అగ్నివీర్ ట్రేడ్స్‌మన్ (8వ తరగతి). అభ్యర్థులు తమ అర్హతల ఆధారంగా ఏ రెండు కేటగిరీలకు దరఖాస్తు చేసుకోవచ్చు. అగ్నివీర్ కేటగిరీలకు గరిష్ట వయోపరిమితి 21 సంవత్సరాల నుండి 22 సంవత్సరాలకు పెంచబడింది. ఆన్‌లైన్ కామన్ ఎంట్రన్స్ పరీక్ష (CEE) 13 భాషల్లో (తెలుగు సహా) నిర్వహించబడుతుంది. ITI, డిప్లొమా, చీజజ అర్హతలు కలిగిన అభ్యర్థులకు అదనపు మార్కులు ఉంటాయి. దరఖాస్తులు కేవలం www.joinindianarmy.nic.in వెబ్‌సైట్ ద్వారా మాత్రమే సమర్పించాలి. దరఖాస్తుల సమర్పణకు చివరి తేదీ 01 ఏప్రిల్ 2026. ఆన్‌లైన్ కామన్ ఎంట్రన్స్ పరీక్ష (CEE) తాత్కాలికంగా 01 జూన్ 2026 నుండి 15 జూన్ 2026 వరకు నిర్వహించబడుతుంది. అడ్మిట్ కార్డులు అదే వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. అభ్యర్థులు తాజా సమాచారం కోసం www.joinindianarmy.nic.in వెబ్‌సైట్‌ను తరచూ పరిశీలించాలి, తమ నమోదు చేసిన ఈ-మెయిల్ ఐడీలను చెక్ చేయాలి. మరిన్ని వివరాల కోసం సికింద్రాబాద్ ఆర్మీ రిక్రూటింగ్ ఆఫీస్‌ను 040-27740059 నంబర్ ద్వారా సంప్రదించవచ్చు. నియామక ప్రక్రియ పూర్తిగా ఆటోమేటెడ్, నిష్పక్షపాత, పారదర్శకంగా జరుగుతుంది. ఎవరైనా మధ్యవర్తులు లేదా మోసగాళ్లు ఉద్యోగం కల్పిస్తామని చెప్పినా నమ్మవద్దు. కేవలం కష్టపడి సిద్ధమవడం ద్వారా మాత్రమే మెరిట్ ఆధారంగా ఎంపిక జరుగుతుంది. మధ్యవర్తులు లేదా ఏజెంట్లకు ఇందులో ఎలాంటి పాత్ర లేదు అని అధికారులు తెలిపారు.

## ఘనంగా ఈటల జన్మదిన వేడుకలు

**సూర్య, వీణవంక**

మాజీ మంత్రి, మల్కాజ్ గిరి ఎంపి ఈటల రాజేందర్ జన్మదిన వేడుకలను శుక్రవారం వీణవంకలో గాలేటి సురేందర్ రెడ్డి, పూదరి అనిల్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి స్వీట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ ఈటల రాజేందర్ హుజురాబాద్ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి పథంలో నడిపించాడని, రాబోయే రోజుల్లో మళ్లీ హుజురాబాద్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పోటీ చేయాలని, ఆయనకు వీణవంక మండల ఈటల అభిమానులు అండదండగా ఉంటామని వారన్నారు. ఆయన మరిన్ని జన్మదిన వేడుకలు జరుపుకోవాలని, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మారముల కొమురయ్య, ఎనుగంటి శ్రీనివాస్ యాదవ్, పెద్ది మల్లారెడ్డి, బొబ్బల విజయ్ కుమార్, సారయ్య, రాజారాం, విజేందర్ రెడ్డి, గడ్డం కుమార్, స్వామి, దొమ్మటి రాజమల్లు, రాయిశెట్టి కుమార్, మారం తిరుపతి రెడ్డి, కొల్లిపాక శ్రీనివాస్, ముర్తాల రఘువరన్, వెంకటేష్, దాగు అశోక్, కర్ణాకర్ రెడ్డి, దాసరపు రాజు, అశోక్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.



## ప్రెస్ క్లబ్ ఆద్వర్యంలో ఇఫ్తార్ విందు

**- హాజరైన ప్రముఖులు...**

**సూర్య మెట్‌పల్లి**



మెట్‌పల్లి ప్రెస్ క్లబ్ ప్రింట్ మీడియా టియుడబ్ల్యుజే. ఐజెయు ఆద్వర్యంలో రంజాన్ సందర్భంగా శుక్రవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. పట్టణంలోని మక్కా మసీ దులో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో పట్టణంలోని ప్రముఖులు, విలేకరులు పాల్గొని ముస్లిం సోదరులకు ఇఫ్తార్ అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పట్టణంలో అన్ని మతాల వారు సోదరభావంతో ఉంటారని. ప్రతి పండగను అందరూ కలిసి ఆచరిస్తారని మతాలకు అతీతంగా ప్రెస్ క్లబ్ ఆద్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం సంతోషదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల మాజీ ఎమ్మెల్యే టిఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు. కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, వైస్ చైర్మన్ ఓంకారి నవీన్, మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు జువాడి కృష్ణారావు, కౌన్సిలర్ లు ఖాజా అజీమ్, గుడికందుల అజయ్, నునుగొండ నరేష్, మాజీ కౌన్సిలర్ మహ్మద్ షాకీర్ సిద్ధికి, మాజీ ఎంపీపీ మారు సాయి రెడ్డి, మాజీ సర్పంచ్ కొమిరెడ్డి లింగారెడ్డి, టీయూడబ్ల్యూజే ఐజేయు జిల్లా అధ్యక్షుడు చీటీ శ్రీనివాసరావు, టీయూడబ్ల్యూజే ఐజేయు మెట్ పల్లి అధ్యక్షుడు డా: బూరం సంజీవ్, జనరల్ సెక్రెటరీ మహమ్మద్ అజీమ్, ఉపాధ్యక్షులు జంగం విజయ్, అఫ్రోజ్, జిల్లా కార్యవర్గ సభ్యులు సాజిద్ పాషా, బాసెట్టి హరీష్, గౌరవ సలహాదారులు దాసం కిషన్ ,క్యాషియర్ మక్సూద్, జాయింట్ సెక్రెటరీ పుంద్ర శశికాంత్ రెడ్డి, పింజర్ శివ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఎండి సమీయుద్దీన్, కార్యవర్గ సభ్యులు పొనగాని మహేందర్, కుర్ర రాజేందర్,యానం రాకేష్ ,రఫీ ఉల్లా, సోహెల్, హైమద్, ముత్యాల రమేష్, ఓంకారి శ్రీనివాస్,బొల్లం రాజు,మాజీ అధ్యక్షుడు ఆగ సురేష్ సభ్యులు ఆదిల్ పాషా, రమణ, ఏసమేని గణేష్, ఎండి అభిద్, శశి కుమారు, అమ్ముల ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

**సూర్య, సెంటినరీ కాలనీ**



కమాన్‌పూర్ మండల కేంద్రంలో ఇటీవల మరణించిన సాన మల్లయ్య, రాణవేన అంజమ్మల చిత్రపటాలకు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ మాట్లాడుతూ మల్లయ్య మరియు అంజమ్మ మరణం స్థానికులకు తీవ్ర లోటు అని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు తన సానుభూతిని తెలియజేస్తూ ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబాలకు రేషన్ కిట్ల పంపిణి

**- సిద్దిపేటలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో100 పేద కుటుంబాలకు రేషన్ కిట్ల పంపిణీ**

**సూర్య గంభీరావుపేట**




గంభీరావుపేట మండల కేంద్రంలోని షాదిఖానాలో శుక్రవారం సిద్దిపేట ఫౌండేషన్ ఆధ్వర్యంలో పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని 100 నిరుపేద కుటుంబాలకు రేషన్ కిట్ల పంపిణీ చేశారు. ఫౌండేషన్ కన్వీనర్ మహమ్మద్ లాయిక్ మూహియుద్దీన్ మాట్లాడుతూ..సిద్దిపేట పౌండేషన్ ఆధ్వర్యంలో గత కొన్ని సంవత్సరాలుగా రంజాన్ నెలలో సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తూ పేదలకు సహాయం చేస్తుందని అన్నారు. సమాజంలోని బలహీన వర్గాలకు సహాయం చేయడం వారి ముఖాల్లో ఆనందం తీసుకురావడం ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జామియా మస్జిద్ కమిటి అధ్యక్షుడు మహమ్మద్ మహబూబ్ అలీ, మాజి వక్ఫ్ బోర్డు జిల్లా ఉపాధ్యక్షుడు మహమ్మద్ అస్లాం, జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు సయ్యద్ జుబేర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హమీద్, జామియా మస్జిద్ మాజీ నిర్వహణ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ ఆసఫ్ అలీ సాదత్ తదితరులు పాల్గొన్నారు.